పీడీఎస్ బియ్యం మాయం కేసులో పోలీసులు, పౌరసరఫరాల శాఖ అధికారులు మాజీమంత్రి పేర్ని నానీకి సహకరిస్తున్నారా..? కావాలనే కేసు విచారణను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారా?.. జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే అవుననే సమాధానం వస్తుంది. బియ్యం ఎంత మాయమైందో తేల్చడానికే నెల రోజుల సమయం పట్టడం, నిందితులను ఇంతవరకు పట్టుకోకపోవడం, బియ్యాన్ని స్వాహాచేసి కాకినాడ పోర్టుకు తరలించడం, కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును దిగమింగినా కేసును సిట్‌కు ఇవ్వకుండా స్థానిక పోలీసులే దర్యాప్తు చేస్తుండటం వెనుక కొన్ని అజ్ఞాత శక్తులు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

లెక్కలేదా..?



బియ్యం మాయం కేసులో అనుమానాలెన్నో..

పోలీసుల నుంచి పౌరసరఫరాల వరకు పేర్ని నానీకి సహకారం

- కేవలం బియ్యం లెక్క తేల్చడానికే నెల సమయం
- అధికారుల లెక్క 185 టన్నులు
- మంత్రి నాదెండ్ల లెక్క 243 టన్నులు
- చివరికి తేలింది 378 టన్నులు
- పూర్తిగా తేల్చకుండా 185 టన్నులకు నోటీసులు
- రూ.1.68 కోట్లు జరిమానా కట్టేసిన పేర్ని
- మిగిలిన 193 టన్నులకు కట్టకుండా జంప్
- కేసు నీరుగార్చడానికే అధికారుల తప్పుడు లెక్కలు
- గత జనవరిలో గోడౌన్ అగ్రిమెంట్ రెన్యువల్
- స్టాక్, వేబ్రిడ్జి సరిగ్గా ఉందని అధికారుల నివేదిక
- వేబ్రిడ్జిలో లోపాలున్నాయని పేర్ని బుకాయింపు

(విజయవాడ/మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : మాజీమంత్రి పేర్ని నానీకి చెందిన గోడౌన్‌లో బియ్యం కుంభకోణం వెలుగుచూసి నెల అవుతున్నా.. అటు అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ సరైన వివరాలు సేకరించలేకపోయారు. నిందితురాలు పేర్ని నాని భార్య జయసుధతో పాటు గోడౌన్ మేనేజర్, నిందితుడు మానస్ తేజ్‌ను కూడా పట్టుకోలేక పోయారంటే పరిస్థితి ఎలా ఉందో తెలుస్తుంది. సాధారణ ఉద్యోగిని పట్టుకోవడానికి నెల సమయం తీసుకున్నారంటే అది ఉద్దేశపూర్వకంగానే జరిపే జాప్యమేననిపిస్తోంది.


పొట్లపాలెంలో పేర్ని నానీకి చెందిన గోడౌన్

లెక్క తేల్చడానికి నెల రోజులా?

మచిలీపట్నం మండలం పొట్లపాలెంలో పేర్ని జయసుధ పేరున ఉన్న గోడౌన్‌లో తొలుత 185 టన్నుల బియ్యం మాయమైనట్లు అధికారులు లెక్కతేల్చారు. ఇదే విషయాన్ని జయసుధ జేసీకి నవంబరు 26న లేఖ రాశారు. ఆ లేఖలో పేర్కొన్న దాన్నే అధికారులూ నిర్ధారించేశారు. అంత మేరకు జరిమానా కట్టాలంటూ డిమాండ్ నోటీసులు కూడా ఇచ్చేశారు. ఆ తర్వాత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కల్పించుకుని.. స్వాహా చేసిన బియ్యం 243 టన్నులని ప్రకటించారు. తీరుబడిగా లెక్కలు తేల్చిన అధికారులు తాజాగా 378 టన్నులు బియ్యం మాయమైనట్లు ప్రకటించారు. రోజుకో లెక్క చెప్పడం ద్వారా అధికారులే కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. మొదట్లో మాయమైన బియ్యం కిలోకు రూ.44.58 చొప్పున ధర నిర్ణయించారు. ఈ లెక్కల ప్రకారం 185 టన్నులకు రెట్టింపు సొమ్మును కట్టాలంటూ అధికారులు జారీచేసిన నోటీసుకు పేర్ని నాని సుమారు రూ.1.68 కోట్లను కట్టేశారు. అయితే, తాజా లెక్కల ప్రకారం మరో 193 టన్నులకు ఆయన జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అంటే.. మరో రూ.1.72 కోట్లు చెల్లించాలి. ఈ మొత్తాన్ని కట్టేసినా గోడౌన్ యజమాని అయిన పేర్ని జయసుధపై క్రిమినల్ కేసు కొనసాగుతుంది. నిందితులకు శిక్ష పడేలా చేయాలంటే పౌరసరఫరాల శాఖ అధికారులు, పోలీసులు పకడ్బందీగా ఆధారాలు సేకరించి కోర్టు ముందుంచాల్సి ఉంది. కానీ, ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

పోలీసుల సహకారం ఉందా?

బియ్యం మాయమైన ఘటనలో ఈ నెల 10న పౌరసరఫరాల శాఖ అధికారులు మచిలీపట్నం తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోడౌన్ యజమాని పేర్ని జయసుధ, మేనేజర్ మానస్ తేజ్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పేర్ని నాని కుటుంబసభ్యులు, గోడౌన్ మేనేజర్ అదృశ్యమయ్యారు. పేర్ని నాని ఒకటి రెండు రోజులు ఇంటివద్దే ఉన్నా, ఆ తర్వాత నుంచి కనిపించలేదు. దీంతో పేర్ని జయసుధ పేరుతో లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. జయసుధ కనిపించని నేపథ్యంలో పేర్ని నాని ఇంటికెళ్లిన పోలీసులు ఈ కేసులో వివరాలు తెలియజేసేందుకు ఆర్‌పేట పోలీస్ స్టేషన్‌కు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులు జారీ చేసినప్పటి నుంచి పేర్ని నాని కూడా కనిపించలేదు. బియ్యం మాయం కేసును నమోదుచేసే సమయంలోనే ముందస్తుగా పోలీసుల నుంచి పూర్తిస్థాయి సమాచారం నానీకి చేరిపోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఆయన కుటుంబం తప్పించుకోవడానికి ఆస్కారం లభించిందనే వాదన వినిపిస్తోంది. ఈ కేసును రాబర్ట్‌సన్ పేట (ఆర్‌పేట) పోలీసులు విచారణ చేస్తున్నారు. సీఐగా ప్రస్తుతం పనిచేస్తున్న ఏసుబాబు గతంలో గుడివాడలో దీర్ఘకాలం పనిచేశారు. ఈ సీఐ గుడివాడలో పనిచేసే సమయంలో అప్పటి పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని చెప్పినట్టే నడుచుకునేవారు. ఈ పరిచయాన్ని పేర్ని నాని బాగా ఉపయోగించుకుంటున్నారు. గోడౌన్ నుంచి స్వాధీనం చేసుకున్న రికార్డులు, కంప్యూటర్లు పోలీసులకు అప్పగించామని పౌరసరఫరాల శాఖ అధికారులు అంటున్నారు. తమ పని పూర్తయిందని, పోలీసులే ఈ కేసులో తగు చర్యలు తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసు విచారణలో పోలీసులు ఇంత వరకు ఎలాంటి ముందడుగు వేయలేకపోతున్నారు.

మిగతా 6లో..


చింతా రవిబాలకృష్ణ శిష్య బృంద కూచిపూడి అభినయం

భళా.. కూచిపూడి కళ

ఘనంగా కూచిపూడి స్వర్ణోత్సవాలు ప్రారంభం

దేశ, విదేశాల నుంచి వచ్చిన కళాకారులు

అలరించిన కూచిపూడి నాట్య ప్రదర్శనలు

కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో కూచిపూడి శ్రీసిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి స్వర్ణోత్సవాల పేరిట ఏర్పాటుచేసిన నాట్యోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు ప్రవాస భారతీయులు తమ నాట్య ప్రదర్శనలతో సిద్ధేంద్రయోగికి నీరాజనాలు అర్పించారు.

8లో



అక్షరాల పండుగ

నేటి నుంచి ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు

- కేబీఎన్ కళాశాలలో రెండు రోజుల పాటు..
- సభా ప్రాంగణానికి పొట్టి శ్రీరాములు పేరు
- 100 మందికి పైగా అతిథులకు ఆహ్వానం

పలు దేశాల నుంచి 1,500 మంది ప్రతినిధుల రాక

6లో



ప్రమాదాలకు దారి చూపేలా

- వాహనాలకు హైబీమ్ ఎల్ఈడీ లైట్లు
- లైట్ల కాంతి తీవ్రత అధికం
- ఎదురు వాహనదారులకు మసకబారుతున్న కళ్లు
- మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘన
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

8లో

సవరించిన అంచనాలకు ఆమోదం నేడు

- నేడు జేసీలతో సబ్‌రిజిస్ట్రార్ల భేటీ
- జిల్లాస్థాయి కమిటీల్లో సవరించిన భూముల ధరలకు ఆమోదం

6లో

బుసక అక్రమాలు

దేవరపల్లి సొసైటీ భూముల తవ్వకాల్లో రాజకీయ రచ్చ

- దరఖాస్తుదారుడి వెనుక వైసీపీ క్రిమినల్ నేత
- ఓ మంత్రి అనుచరుడినని దరఖాస్తుదారుడి ప్రచారం
- వైసీపీకి చెంది, టీడీపీతో అంటకాగుతున్న మరో నేత సహకారం
- నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చే ప్రయత్నాలు
- వ్యతిరేకంగా దేవరపల్లి సొసైటీ సభ్యులు


దేవరపల్లి సొసైటీకి తూర్పువైపు, నదీపాయ పక్కన విస్తారమైన బుసక భూములు

తోట్లవల్లూరు మండలంలో ఇసుక, బుసక తవ్వకాల కోసం విచిత్రమైన రాజకీయ పొత్తులు చోటుచేసుకుంటున్నాయి. 2022లో వైసీపీ ప్రభుత్వ అండతో ఇద్దరు నాయకులు దేవరపల్లి సొసైటీ పక్క భూముల్లో బుసకను దళితులను బెదిరించి మరీ ఇష్టానుసారంగా తవ్వేశారు. వారిలో ఒకరు ప్రస్తుత ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజాకు దగ్గరై స్థానిక టీడీపీ నేతలతో జట్టుకట్టగా, గతంలో టీడీపీ నేతను హత్య చేసిన మరో క్రిమినల్ వైసీపీ నేతతో కలిసి తాజాగా దేవరపల్లి సొసైటీ భూములపై కన్నేశారు. బుసక తవ్వకాల పేరిట మచిలీపట్నానికి చెందిన వ్యక్తిని తెరపైకి తీసుకురాగా, అతనేమో ఓ మంత్రి అనుచరుడినని చెప్పుకొంటూ తవ్వకాలు జరిపేందుకు సిద్ధమైపోతున్నాడు.

తోట్లవల్లూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలం దేవరపల్లి ఎస్సీ ఫీల్డ్ లేబర్ కో-ఆపరేటివ్ సొసైటీ సర్వే నెంబర్ 190లోని భూముల్లో బుసక తవ్వకాలకు మచిలీపట్నానికి చెందిన వెంకటస్వామి అనే వ్యక్తి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ విషయాన్ని తహసీల్దార్ కుసుమకుమారి గతంలోనే చెప్పారు. అయితే, దరఖాస్తుదారుడు వెంకటస్వామికి దేవరపల్లి సొసైటీ భూముల్లో బుసక ఉందని ఎలా తెలిసింది..? అనే ప్రశ్నలు వస్తున్నాయి. బుసక తవ్వకాలకు ఆయన దరఖాస్తు చేయగా, స్థానికంగా మాత్రం ఇద్దరు వైసీపీ నేతలు అతనికి జత కలవటం రాజకీయంగా దుమారం రేపుతోంది.

ఇష్టానుసారంగా..

ఈ నెల 17న దేవరపల్లి సొసైటీ భూముల వద్ద అధికారుల బృందం సర్వే నిర్వహించి జెండాలను హద్దులుగా పాతారు. జీవో నెం 59 ప్రకారం సొసైటీ సీ క్లాస్ భూముల్లో తవ్వకాలకు అనుమతివ్వటం కుదరదని చెప్పిన అధికారులు అందుకు విరుద్ధంగా సర్వే చేశారు. అధికారుల తీరుని, సొసైటీ సభ్యుల ఆవేదనను 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అధికారులు అనుమతి ఇచ్చేందుకు వెనుకాడారు. అయినప్పటికీ ఇసుక, బుసకను తవ్వేందుకు దరఖాస్తుదారుడు, వైసీపీ నాయకులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వైసీపీ క్రిమినల్ నేతకు మద్దతుగా ఓ గ్రామానికి చెందిన టీడీపీ అధ్యక్షుడు రంగంలోకి దిగి సొసైటీ సభ్యులను అడ్డురావొద్దని కోరినట్టు తెలిసింది. ఈ విచిత్ర రాజకీయ పొత్తులు అసలైన టీడీపీ కార్యకర్తలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. దేవరపల్లి సొసైటీ చుట్టూ ప్రభుత్వ భూముల్లో రూ.కోట్ల విలువైన ఇసుక, బుసక ఉండటంతో అందరూ కలిసిపోయారనే విమర్శలు వస్తున్నాయి.

మిగతా 6లో..

సమాచారం ఇవ్వరేం..

- జెడ్పీ నిధులతో చేసే అభివృద్ధి పనులకు పిలవరా?
- జెడ్పీ సమావేశంలో చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఫైర్
- పింఛన్లు, ఇళ్ల నిర్మాణంపై అధికారులకు ప్రశ్నలు
- ఈనెల 31నే పింఛన్లు ఇస్తామన్న అధికారులు


మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక. చిత్రంలో సీఈవో కన్నమనాయుడు

మచిలీపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ నిధులతో అభివృద్ధి పనులు ప్రారంభించే సమయంలో జడ్పీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వట్లేదని, ఈ అంశంపై అధికారులకు పలుమార్లు తానే స్వయంగా చెప్పానని, ఇక నుంచి ఈ అంశంపై తాను జడ్పీ సమావేశాల్లో మాట్లాడనని, నేరుగా పంచాయతీరాజ్ కమిషనర్‌కు లేఖ రాస్తానని జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక మండిపడ్డారు. జడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ సమావేశపు హాల్లో శుక్రవారం జిల్లాపరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ మండలస్థాయిలో జరిగే అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించిన కనీస సమాచారం అధికారులు జడ్పీటీసీ సభ్యులకు ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.

అందరికీ పింఛన్లు

గ్రామీణాభివృద్ధి శాఖపై జరిగిన సమీక్షలో చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ అనర్హుల పింఛన్లను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని.. జిల్లాలో ఎంతమందివి తొలగిస్తున్నారో వివరాలు చెప్పాలన్నారు. అధికారులు స్పందిస్తూ పాత పింఛన్ల తొలగింపు ప్రక్రియపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదన్నారు. ఈ నెల 31వ తేదీనే పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నూతన పింఛన్ల మంజూరుపై జనవరిలో ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

పాత పద్ధతిలోనే ఇళ్ల నిర్మాణం

జిల్లాలో నూతనంగా నిర్మించే ఇళ్లకు ప్రభుత్వం రూ.4 లక్షలు ఇస్తుందనే ప్రచారం జరుగుతోందని, దీంతో జగనన్న కాలనీల్లో ఇంకా గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులు ఆ పథకంలో చేరి ఇళ్లు నిర్మించుకునే ఆలోచనలో ఉన్నారని, ప్రభుత్వం ఇందుకు అనుమతులు ఇచ్చిందా.. అని పలువురు సభ్యులు అధికారులను వివరణ కోరారు. గృహ నిర్మాణశాఖ అధికారులు మాట్లాడుతూ పాత పద్ధతిలోనే ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు ఇస్తామని, రూ.4 లక్షల ప్రతిపాదన ఏమీ లేదని తెలిపారు. ఇళ్లు నిర్మించుకుంటున్న

మిగతా 6లో..

నీరసంగా నిరసనలు

ఉమ్మడి కృష్ణాలో పేలవంగా వైసీపీ విద్యుత్ పోరుబాట

- కనిపించని పేర్ని నాని, కొడాలి నాని, వల్లభనేని వంశీ
- మిగిలిన చోట్లా నామమాత్రంగానే..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల బాదుడంటూ వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా జరిగిన నిరసనలు తుస్సు..మన్నాయి. పామర్రు నియోజకవర్గం మినహా మిగిలిన చోట్ల నిరసన కార్యక్రమానికి సొంత పార్టీ నాయకులతో పాటు ప్రజల నుంచి స్పందన రాలేదు. ఇక విజయవాడ, జగ్గయ్యపేట, నందిగామ మినహా మిగిలిన నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి.

ముఖ్య నాయకులు ఎక్కడ?

మచిలీపట్నం నియోజకవర్గంలో పేరున్న నాయకులెవరూ నిరసనలో కనిపించలేదు. బియ్యం స్వాహా కేసులో ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టూ అజ్ఞాతంలో ఉన్నారు. దీంతో వారు ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. మచిలీపట్నం కార్పొరేషన్ మేయర్ వైసీపీకి చెందినవారే అయినా.. ఆమె ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. ఆమె తరపున ఆమె భర్త పాల్గొన్నారు. పేర్ని నానీపై ఉన్న అసంతృప్తితో చాలామంది నాయకులు కార్యక్రమానికి దూరంగా ఉండిపోయారు. గుడివాడ నియోజకవర్గంలోనూ పెద్ద నాయకులు కనిపించలేదు. కొడాలి నాని అసలు ఊర్లోనే లేరు. గన్నవరం నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి. మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు వల్లభనేని వంశీ ఎన్నికల అనంతరం

మిగతా 6లో..


నగరంలో విద్యుత్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న వైసీపీ నేత దేవినేని అవినాశ్

బహిరంగ ప్రకటన

ICICI Bank

నమోదిత కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్, చక్లి సర్కిల్ సమీపాన, పాత పద్రా రోడ్, వడోదర - 390 007
కార్పొరేట్ కార్యాలయం : ICICI బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, ముంబాయి 400 051.

బంగారం ఇ-వేలం సహిత ఆహ్వాన ప్రకటన

బంగారు ఆభరణాల సౌకర్యం నిమిత్తం ICICI బ్యాంక్ లిమిటెడ్ (ICICI బ్యాంక్) నుండి పొందిన (సౌకర్యం) తమ బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన రుణగ్రహీతలకు నోటీసు జారీచేయడమైనది. వారు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైనందున, తాకట్టుపెట్టిన బంగారు ఆభరణాలను జనవరి 08, 2025న ఇ-వేలం వేయడానికి మాకు తప్పనిసరి అయ్యింది. ఎలాంటి ముందస్తు నోటీసు లేకుండానే ఖాతాను తొలగించడానికి/ ఇ-వేలం తేదీని మార్పు చేయడానికి ICICI బ్యాంక్‌కు అధికారం ఉంది. వేలం - https://gold.samil.in ఆన్‌లైన్‌లో మ.12:30 గం. నుండి మ.3:30 గం. మధ్య నిర్వహించబడుతుంది. సవివరమైన నియమ నిబంధనల కోసం ఇవ్వబడిన వెబ్‌సైట్‌కు లాగిన్ అవండి. మరణించిన రుణగ్రహీత విషయంలో, వారి న్యాయవారసులకు అన్ని నియమ నిబంధనలు వర్తిస్తాయి.

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: కడప	
067405013360	ఉమ్మడి శారద
శాఖ పేరు: గుంటూరు	
630705029005	రమేశ్ బాబు ముద్రబోయిన
శాఖ పేరు: కందుకూరు	

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
069705022486	హరిప్రసాద్ కొత్తపల్లి
శాఖ పేరు: పీలేరు	
375505002879	జి. కవిత
శాఖ పేరు: విజయవాడ	
630605127096	గోగులపాటి షేక్ అమాన్
630605127280	మందాడపు హనుమంతరావు

రుణ ఖాతా నం.	ఖాతాదారు పేరు
శాఖ పేరు: విజయవాడ - గురునానక్ కాలనీ	
794705000075	మందాడపు హనుమంతరావు
శాఖ పేరు: వెల్లుట్ల	
221305001502	కల్లపెల్లి లక్ష్మణ్

తేది: 28.12.2024
ప్రదేశము : గుంటూరు, కృష్ణ, ఎన్.టి.ఆర్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, వైఎస్సార్, జగిత్యాల

సం/- అధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ తరపున

కలం సందడి



- నేటి నుంచి ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు
- కేబీఎన్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహణ
- సభా ప్రాంగణానికి పొట్టి శ్రీరాములుగా నామకరణం
- ప్రపంచ దేశాల నుంచి ప్రతినిధులు రాక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాహిత్యవాడలో కలం ప్రియుల సందడి కనిపించనుంది. సాహిత్యప్రియుల ఆత్మీయ కలయికకు నగరంలోని కేబీఎన్ కళాశాల వేదిక కానుంది. కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మహాసభలను కొత్తపేటలోని కేబీఎన్ కళాశాలలో నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై ఆదివారం సాయంత్రం వరకు జరుగుతాయి. మహాసభలకు ఇప్పటి వరకు 1500మంది ప్రతినిధులు పేర్లను నమోదు చేయించుకున్నారు. అమెరికా, దుబాయ్, యూఏఈతో పాటు మరికొన్ని దేశాల నుంచి ప్రతినిధులు ఇప్పటికే విజయవాడకు చేరుకున్నారు. 100 మందికి పైగా అతిథులు హాజరవుతున్నారు. మహాసభలకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా ప్రాంగణానికి అమరజీవి పొట్టి శ్రీరాములుగా నామకరణం చేశారు. మొత్తం మూడు వేదికలపై కార్యక్రమాలు నిర్వహిస్తారు. చెరుకూరి రామోజీరావు, దాశరథి, ఆశావాది ప్రకాశరావుగా వేదికలకు పేర్లు పెట్టారు. 300మంది విద్యార్థులు మహాసభల్లో పాల్గొననుండగా వారికి కవిత, సాహిత్యం, రచనలపై శిక్షణా తరగతులు నిర్వహించాలని భాషాభిమానులు నిర్ణయించారు. ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథులుగా సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి నూతలపాటి వెంకటరమణ, అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు హాజరుకానున్నారు. యువకవి సమ్మేళనాలు నిర్వహించనున్నారు. మొత్తం ఐదు కవి సమ్మేళనాలు నిర్వహిస్తారు. సభాప్రాంగణంలో తెలుగుతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు నిర్వహించిన మహాసభల నేపథ్యంలో 'మార్పు' పేరుతో పరిశోధనా గ్రంథాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని పశ్చిమ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ ఆవిష్కరిస్తారు.

నేటి కార్యక్రమాలు...

చెరుకూరి రామోజీరావు సభావేదిక

ఉ. 8.30 గంటలకు కూచిపూడి నాట్య ప్రదర్శన
ఉ. 9.30 గంటలకు ప్రారంభోత్సవ సభ
మ. 12 గంటలకు తెలుగు వెలుగుల సభ
మ. 1.30లకు శాస్త్ర సాంకేతికరంగ ప్రతినిధుల సదస్సు
మ. 3 గంటలకు పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సు
సా. 4.30లకు మహిళా ప్రతినిధుల సదస్సు
సా. 6 : సాంస్కృతిక రంగ ప్రతినిధుల సదస్సు

దాశరథి సభావేదిక

మ. 12 గంటలకు కవితా సదస్సు
మ. 1.30లకు విద్యారంగ ప్రతినిధుల సదస్సు
సా. 3.30లకు సాహిత్య సదస్సు
సా. 5.30లకు యువకలాల సమ్మేళనం-1

ఆశావాది ప్రకాశరావు సభావేదిక

మ. 12 గంటలకు ఒకటో కవి సమ్మేళనం
మ. 2.30లకు రెండో కవి సమ్మేళనం
సా. 5 గంటలకు మూడో కవి సమ్మేళనం

సవరించిన అంచనాలు.. ఆమోదం నేడు

- నేడు ఉమ్మడి జిల్లా జేసీలతో సబ్‌రిజిస్ట్రార్ల భేటీ
- జిల్లా స్థాయి కమిటీలలో సవరించిన భూముల ధరలకు ఆమోదం
- గ్రామీణ ప్రాంతాల్లో 10 శాతం, పట్టణ ప్రాంతాల్లో 12 శాతం మేర విలువ పెంపు ప్రతిపాదన
- ఎల్‌పీఎం నెంబర్లపై ప్రత్యేక ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భూముల రిజిస్ట్రేషన్ల ధరల పెంపుదల వాయిదా పడినప్పటికీ.. ఉమ్మడి కృష్ణా జిల్లా వ్యాప్తంగా నిర్దేశించిన ధరలను జిల్లా కమిటీల ఆమోదం పొందేందుకు సబ్‌రిజిస్ట్రార్లు శనివారం జాయింట్ కలెక్టర్లతో సమావేశం కానున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్లు 10 శాతం మేర భూముల ధరల పెంపుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విజయవాడ నగరం, గ్రేటర్ విలీన గ్రామాల పరిధిలో మాత్రం 12 శాతం వరకు భూముల ధరల పెంపుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడ నగరం, విజయవాడ గ్రేటర్ విలీన ప్రతిపాదిత గ్రామాలలో 30 శాతం మేర పెంపుదల చేశారు. పట్టణ ప్రాంతాలన్నింటిలోనూ 30శాతం మేర ధరలను పెంచారు. పట్టణ ప్రాంతాల్లో చెత్తపన్నును దృష్టిలో ఉంచుకుని వైసీపీ ప్రభుత్వం ఒక్కసారిగా మార్కెట్ ధరలను పెంచింది. చెత్తపన్ను విధింపు మార్కెట్ విలువల ప్రకారం పెంచాలన్న నిబంధన కూడా వైసీపీ ప్రభుత్వమే పొందుపరిచింది. మార్కెట్ విలువ ఎంత పెరిగితే అంతగా చెత్త పన్ను పెరుగుతుంది. ఇలాంటి వ్యవహారాల కారణంగా భూముల ధరలను విపరీతంగా పెంచటతో.. రియల్ ఎస్టేట్ భారీగా కుదుపునకు గురైంది. ఒక వైపు భూముల ధరలు విపరీతంగా పెరిగిపోతే.. మరోవైపు ప్రజల్లో కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయింది. దీంతో రియల్ ఎస్టేట్ కుదేలైంది. దీనిని దృష్టిలో ఉంచుకుని 10 శాతం మేర మాత్రమే భూముల ధర పెంపుదలకు ప్రభుత్వం నిర్దేశించింది. ఆ మేరకే పెంపుదల చేశారు. పెంచిన ధరలను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావటంతో అమలు చేయరని తెలుస్తోంది. తాత్కాలికంగా చేయకపోయినా రానున్న రోజుల్లో అమలుకు వీలుగా పెంచిన ధరలను జిల్లా కమిటీల వద్ద ఆమోదానికి పెట్టాలని నిర్దేశించటం జరిగింది. శనివారం ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల జాయింట్ కలెక్టర్ల నుంచి పెంచిన ధరలకు సంబంధించి సబ్‌రిజిస్ట్రార్లు ఆమోదం తీసుకోనున్నారు.

ఎల్‌పీఎం నెంబర్లపై మార్గదర్శకాలు

గత వైసీపీ ప్రభుత్వంలో జరిపిన రీ సర్వే కారణంగా సర్వే నెంబర్ల స్థానంలో ఏర్పాటు చేసిన ఎల్‌పీఎం నెంబర్ల కారణంగా భూముల ధరలను సవరించే క్రమంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని సబ్‌రిజిస్ట్రార్లు గగ్గోలు పెడుతున్న సంగతి తెలిసిందే. ఒక ఎల్‌పీఎంలో భూ యజమానికి ఎన్నిచోట్ల భూములు ఉంటే అవన్నీ వస్తున్నాయి. ఎల్‌పీఎం ప్రాతిపదికన భూములు పెంచితే మిగిలిన చోట్ల కూడా పెరిగిపోతున్నాయి. దీనికారణంగా ఒక గ్రామంలో ఎల్‌పీఎం నెంబర్లు ఉన్నచోట భూముల ధరలు ఎక్కువగానూ, సర్వే నెంబర్లు ఉన్నచోట భూముల ధరలు తక్కువగానూ ఉంటాయి. ఈ గందరగోళం కారణంగా ఎల్‌పీఎం నెంబర్లకు సంబంధించి ఎలా సవరింపులా చేయాలన్న దానిపై సబ్‌రిజిస్ట్రార్లు తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఈ అంశానికి సంబంధించి మౌఖిక ఆదేశాలు వచ్చాయి.



చెత్త సంపద సృష్టి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

సూర్యఘర్‌ను సద్వినియోగం చేసుకోండి

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించేందుకు, ఆర్థిక స్వావలంబనకు ఉపయోగపడుతున్న ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. శుక్రవారం అధికారులతో కలిసి ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పీఎం సూర్యఘర్ పథకంతో లబ్ధిపొందుతున్న విశ్రాంత ఆర్అండ్‌బీ ఇంజినీర్ ఏఆర్ఎస్‌పీ ప్రసాద్ ఇంటిని సందర్శించారు. ఈ వ్యవస్థ ఏర్పాటు చేసుకోకముందు, ప్రస్తుతం వస్తున్న బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మిగిలిన వారు కూడా సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం తనిఖీ

గుంటుపల్లిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడి కార్యకలాపాలను కలెక్టర్ పరిశీలించారు. వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మిళిత వృద్ధి సాధనలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలి

కృష్ణలంక : స్వర్ణాంధ్ర 2047 సాకారం దిశగా అమలుచేస్తున్న ప్రణాళికలు మంచి ఫలితాలు ఇవ్వడంలో, అన్ని రంగాల్లోనూ 15 శాతం సుస్థిర, సమ్మిళిత వృద్ధి సాధనలో బ్యాంకులు కీలకపాత్ర పోషించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో లీడ్ జిల్లా కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా సంప్రదింపుల కమిటీ (డీసీసీ), జిల్లాస్థాయి సమీక్షా కమిటీ సమావేశం (డీఎల్ఆర్‌సీ) జరిగింది. సమావేశంలో వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాల సాధన, పురోగతిపై చర్చించారు. బ్యాంకులు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలను చేరుకొనేందుకు కృషి చేయాలని తెలిపారు. పీఎంఈజీపీ, స్టాండప్ ఇండియా, ప్రధానమంత్రి ముద్రా యోజన, ఆత్మ నిర్భర్-పీఎం స్వానిధి, ఏపీ టిడ్కో-పీఎంఏవై (అర్బన్) తదితరాలపైనా సమావేశంలో చర్చించారు. డీసీసీ కన్వీనర్ ఎం.శ్రీధర్, ఆర్‌బీఐ మేనేజర్ నాగప్రవీణ్, నాబార్డు డీడీఎం మిలింద్ చౌసాల్కర్, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఆర్ఎస్ఈటీఐ డైరక్టర్ మల్లిఖార్జునరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి, పశుసంవర్థక అధికారి ఎం.హనుమంతరావు, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, వివిధ బ్యాంకుల కంట్రోలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిని విడుదల చేయించండి

- ఈఎన్‌సీకి ఎన్ఎస్ఆర్ ప్రాజెక్టు కమిటీ వీసీ ఆళ్ల వినతి

విజయవాడ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ఎడమకాలువ మూడో జోన్‌లో ఉన్న ఆరుతడి పంటలను రక్షించుకునేందుకు ఎన్ఎస్ఆర్ నుంచి నీటిని విడుదల చేయించాలని ఎడమ కాల్వ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణ జలవనరుల శాఖ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావును కోరారు. విజయవాడలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఆయనకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నాగార్జునసాగర్ ఎడమకాలువ పరిధిలో గన్నవరం, నూజివీడు, దెందులూరు, తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 2.36లక్షల ఎకరాల్లో మామిడి, పొగాకు, మిర్చి, పత్తి, జొన్న, మొక్కజొన్న, వేరుశనగ, మినుము తదితర ఆరుతడి పంటలను ఆయకట్టుదారులు సాగు చేశారన్నారు. ప్రభుత్వం నవంబరులో చేసిన విజ్ఞప్తి మేరకు నాగార్జునసాగర్ ఎడమకాలువకు డిసెంబరు, జనవరిలో 12 టీఎంసీలు నీరు ఇవ్వాలని కృష్ణానది యాజమాన్య బోర్డు ఈనెల ఐదున ఆదేశాలు ఇచ్చిందన్నారు. తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు 20 నుంచి కాలయాపన చేస్తూ సాగునీరు ఇవ్వడం లేదని ఈఎన్‌సీ దృష్టికి తీసుకెళ్లారు. ఎడమ కాల్వ నుంచి సత్వరం నీటిని విడుదల చేయించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బందరులో నకిలీ నోట్ల కలకలం!

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో నకిలీ కరెన్సీ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకోవడం స్థానికంగా సంచలనం రేకెత్తించింది. గురువారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లోని ఒక మద్యం దుకాణంలో ఓ వ్యక్తి దొంగ నోట్లు మార్చుతుండగా సిబ్బంది గుర్తించారు. చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చాకచక్యంగా నకిలీ నోట్లు చలామణి చేసేందుకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు, అతని స్నేహితులు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నలుగురూ దొంగనోట్ల మార్పిడికి మచిలీపట్నం, పెడన ప్రాంతాల నుంచి తీసుకువస్తున్నట్టు పోలీసు విచారణలో తేలింది. ఈ ముఠాపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు. దీని వెనుక 37వ డివిజన్‌కు చెందిన ఒక రాజకీయ పార్టీ నేత పాత్ర ఉన్నట్టు సమాచారం. చిలకలపూడి సీఐ నబి కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల వివరాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు.

కారు మెకానిజం, ప్లంబింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం నైపుణ్యాభివృద్ధి శిక్షణాకేంద్రంలో జనవరి 6 నుంచి కారు మెకానిజం, ప్లంబింగ్ అండ్ శానిటరీ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్టు స్వర్ణభారత్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యూందాయ్ కుశలవ సాంకేతిక సహకారంతో కారు మెకానిజం కోర్సులో శిక్షణ, జాక్వార్ కంపెనీ సాంకేతిక సహకారంతో ప్లంబింగ్ కోర్సులో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కోర్సుల కాలపరిమితి మూడునెలలుంటుందని, శిక్షణా కాలంలో అభ్యర్థులకు భోజనం, హాస్టల్ వసతి సదుపాయాలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. 10వ తరగతి/ఐటీఐ (ఫిట్టర్, ఎలక్ట్రీషియన్) చదివి, 18నుంచి 35సం.ల వయసుగల నిరుద్యోగులు ఆయా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. శిక్షణానంతరం సర్టిఫికెట్లు, టూల్‌కిట్లతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు అవసరమైన సహాయ, సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. ఆయా కోర్సుల్లో నైపుణ్యాలు మెరుగుపరచుకోవటంద్వారా కారు మెకానిక్, ప్లంబర్‌గా స్వయం ఉపాధిని పొందాలనుకునే నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, అర్హతగల యువకులు సంబంధిత ధ్రువీకరణపత్రాలతో నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు బి.రామకృష్ణ(ఇన్‌స్ట్రక్టర్)-9440925583 నెంబర్‌లో సంప్రదించాలని దీపా వెంకట్ పేర్కొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో కాకతీయ శాసనాలు

- రొంపిచర్ల చారిత్రక ఆనవాళ్లను కాపాడాలి
- పురావస్తు పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి



శాసనాలు, శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా రొంపిచర్ల శివారులోని వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే దారిలో నిర్లక్ష్యానికి గురైన క్రీ.శ. 10-13 శతాబ్దాల నాటి శిల్పాలు, శాసనాలను భద్రపరిచి, కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. వారసత్వ సంపదను గుర్తించి, పరిరక్షించడానికి చేపట్టిన అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రొంపిచర్లలో పర్యటించి పలు చారిత్రక ఆనవాళ్లను గుర్తించారు. గ్రామ వెలుపల, వినాయక ఆలయం ముందు రోడ్డుపై, మదన గోపాల దేవాలయానికి వెళ్లే దారిలో, క్రీ.శ 10వ శతాబ్దానికి చెందిన మహిషాసురమర్దిని, బ్రహ్మ, కుమారస్వామి, భైరవ, నంది విగ్రహాలు, ఇంకా కాకతీయ గణపతి దేవుడు, ప్రతాపరుద్రుడు విడుదల చేసిన రాతి శాసనాలు ఆలనా పాలనా లేక గడ్డి, గాదం మధ్య పడివున్నాయన్నారు. గణపతి దేవుని శాసనంలో స్థానిక కేశవ దేవునికి, క్రీ.శ.1320 నాటి ప్రతాపరుద్రుని శాసనంలో స్థానిక అనంత గోపీనాథ దేవుని అమావాస్య కొలువులకు రెడ్ల చెరువు వెనక కొంత భూమిని దానం చేసిన వివరాలు, అలాగే క్రీ.శ. 1245 నాటి కోట భీమరాజు మంత్రి వల్లభుడు, రొంపిచర్లలో కట్టించిన గోపీనాథ ఆలయానికి కొంత భూమిని దానం చేసిన వివరాలు వున్నాయని ఆయన చెప్పారు. రొంపిచర్ల చరిత్రకు సాక్ష్యాలైన ఈ శిల్పాలు, శాసనాలను కాపాడి, భవిష్యత్ తరాలకు అందించాలని శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గట్టుప్పల్ శ్రీనివాస్ పద్మ వంశీ, స్థపతి బి.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ పెంచాలి

- వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ

కృష్ణలంక, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ లీకేజీలను అరికట్టాలని, కొత్త రిజిస్ట్రేషన్లను నమోదు చేయించాలని వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ తెలిపారు. విజయవాడలోని ఆయోధ్యనగర్, ఆటోనగర్‌లోని వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో మాట్లాడుతూ డివిజన్ రెవెన్యూ పెంపొందించడానికి ప్రతి ఉద్యోగి తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని నిర్దేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా ఆడిట్లు, ఇన్‌స్పెక్షన్స్, రిటర్న్ స్క్రూటినీలను త్వరితగతిన పూర్తిచేయాలని, పాత బకాయిల వసూళ్లను ముమ్మరం చేయాలని ఆదేశించారు.

సంగీత సరస్వతికి కష్టాలు!

- ఒంటరి జీవనం.. ప్రభుత్వ పింఛనే ఆధారం
- అనారోగ్యం.. కాళ్లు చచ్చుబడిపోయి నడవలేని పరిస్థితి
- దాతలు ఆదుకోవాలని వృద్ధురాలి వేడుకోలు



నడవలేని స్థితిలో శ్రీదేవి

వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆమె ఉన్నత విద్యావంతురాలు.. సంగీతంలో ఎంఏ పట్టా పొందింది.. అయితే చిన్నతనం నుంచి ఆమెను కష్టాలు వెన్నాడుతూనే ఉన్నాయి. బాల్యంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ఆమెను సమీప బంధువు చేరదీసి ఉన్నత చదువులు చదివించారు. తోడుంటానన్న భర్త మొహం చాటేయడం.. చేరదీసిన బంధువు మృతి చెందడంతో ఆమె జీవితం ఒంటరిగానే సాగింది. పిల్లలకు ట్యూషన్లు చెప్పుకుంటూ కాలం గడిపింది. చివరకు వృద్ధాప్యంలో చూసేవారు లేక ప్రభుత్వ పింఛన్‌తో కాలం వెళ్లదీస్తోంది. ఇటీవల అనారోగ్యంతో రెండు కాళ్లూ చచ్చుబడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో దాతలు ఆదుకోవాలని అర్థిస్తోంది.

విద్యాధరపురం కొట్టేటి కోటయ్యవీధిలో అద్దె ఇంట్లో ఉంటున్న వృద్ధురాలు శ్రీపాద శ్రీదేవి (60) ఒంటరిగా జీవిస్తోంది. ప్రభుత్వం ఇచ్చే సామాజిక పెన్షన్ రూ.4 వేలే ఆమెకు ఆధారం. ఆరోగ్యం సహకరించక, చూసే వారులేక సాయం చేసే దాతల కోసం ఎదురు చూస్తోంది. రెండేళ్ల వయస్సులో తల్లి, 12 ఏళ్ల వయస్సులో తండ్రి మృతి చెందడంతో ఆమె బంధువు చదివించి పెంచి పెద్ద చేశారు. ఆమె విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదివింది. విజయవాడ ఘంటసాల సంగీత కళాశాలలో గ్రాతంలో ఎంఏ పట్టా పొందింది. సమీప బంధువే ఆమె ఆలనా పాలనా చూశారు. అనంతరం ఆయన కూడా అనారోగ్య కారణాలతో మృతి చెందారు. వివాహమాడిన భర్త విడిచిపెట్టి వెళ్లిపోవడంతో ట్యూషన్లు చెప్పుకుంటూ జీవించింది. చివరకు అద్దె ఇంట్లో ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తోంది. అనారోగ్యంతో రెండు కాళ్లు చచ్చుబడిపోవడంతో ఆపరేషన్‌కు రూ.2 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని డాక్టర్లు చెప్పారని, దాతలు ఆదుకోవాలని ఆమె అభ్యర్థిస్తోంది. సహాయం చేయదలచినవారు 8978810135 నెంబరులో సంప్రదించవచ్చు.

లెక్కలేదా..?

(5వ పేజీ తరువాయి)

పౌరసరఫరాల శాఖ అధికారుల తీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఏడాది జనవరిలో గోడౌన్‌ను రెన్యువల్ చేశారు. ఆ సమయంలో స్టాక్‌ను తనిఖీ చేసి, అంతా సరిగ్గా ఉంటేనే రెన్యువల్ చేయాలి. ఎలాంటి తనిఖీలు చేయకుండానే, అంతా సక్రమంగా ఉందంటూ గోడౌన్ అగ్రిమెంట్‌ను మరో ఏడాది రెన్యువల్ చేశారు. వేబ్రిడ్జిని కూడా తనిఖీ చేసి బాగా ఉందని సర్టిఫై చేశారు. అయితే, అప్పటికే బియ్యం పక్కదారి పట్టిందా? లేక ఎన్నికల ముందు పక్కదారి పట్టిందా? అనే విషయాన్ని నిగ్గుతేల్చడంలో అధికారులు విఫలమయ్యారు. మరోవైపు పేర్ని నాని.. వేబ్రిడ్జిలో లోపాల కారణంగానే బియ్యం షార్టేజీ వచ్చిందని బుకాయిస్తున్నారు. వేబ్రిడ్జిలో లోపం ఉంటే వందల కేజీల్లో తేడా వస్తుంది కానీ, వందల టన్నుల్లో తేడా ఎలా వస్తుందనే ప్రశ్నకు సమాధానం లేదు. గోడౌన్‌కు పూర్తి బాధ్యత యజమానిదే. గోడౌన్‌లోని బియ్యం నిల్వల్లో అక్రమాలు జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఒప్పంద పత్రంలో స్పష్టంగా పేర్కొన్నారు. అధికారులు, పోలీసులు ఈ కేసుపై పూర్తిస్థాయిలో దృష్టిపెడితే నిందితులకు కచ్చితంగా శిక్షపడే అవకాశాలు ఉన్నాయి.

బెయిల్ పిటీషన్‌పై 30న తుదితీర్పు


ఈ కేసులో జయసుధ దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటీషన్‌పై శుక్రవారం 9వ అదనపు జిల్లా కోర్టులో వాదోపవాదాలు జరిగాయి. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 30కి వాయిదా వేశారు.

బుసక అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

మంత్రి పేరును వాడుకుంటూ ఎలాగైనా అనుమతులు సాధించేందుకు వెంకటస్వామి ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. దీంతో అధికారులు కూడా సానుకూలంగా పనిచేస్తూ రిపోర్టులు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.


నన్ను సొసైటీ సభ్యుడు కాదంటున్నారు



\- పెదపూడి కోటేశ్వరరావు, సొసైటీ రైతు

నేను సొసైటీ సభ్యుడను. ప్రస్తుతం మొక్కజొన్న వేశాను. గతంలో రైతు భరోసా వచ్చింది. సొసైటీ రిజిస్టర్‌లో నా పేరుంది. బుసక తవ్వకాలను వ్యతిరేకిస్తుంటే తనను సొసైటీ సభ్యుడు కాదని అధికారులు చెప్పటం దారుణం. బుసక తవ్వకాలు జరిపితే సొసైటీ భూములు మిగలవనేదే నా తపన.

వైసీపీ హయాంలో బుసక తవ్వినవారే..



\- దేవరపల్లి బాబూరావు, సొసైటీ రైతు

మా సొసైటీకి పడమర వైపున, సర్వే నెంబర్ 190లోని ప్రభుత్వ భూముల్లో 2022లో తవ్వకాలు జరిపారు. జగనన్న ఇళ్ల స్థలాల మెరక పేరుతో ఇద్దరు వైసీపీ నేతలు అందరినీ భయపెట్టి సుమారు 50 ఎకరాల్లో భారీగా బుసకను తవ్వేశారు. ఆ భూమి గుండంగా మారి ఇసుకలో కలిసిపోయింది. సొసైటీ భూములను కూడా ఇలాగే మార్చాలనుకుంటున్నారు. ఆ ఇద్దరు బుసక తవ్వకాల కోసం వస్తున్నారు. నేను సొంత ఖర్చుతో బోరు నిర్మించుకుని మొక్కజొన్న వేశాను. బుసక తవ్వకాలు జరిపితే ఆ భూమి కోతకు గురై నదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- సీపీ ఎస్వీ రాజశేఖర్



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖర్

మైలవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ సూచించారు. ఎల్బీఆర్సీఈలో శుక్రవారం సైబర్ క్రైమ్, డిజిటల్ అరెస్టు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, సైబర్ నేరాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంత ముఖ్యమో, సైబర్ నేరాలు జరగకుండా అవగాహన కల్పించడం కూడా అంతే ముఖ్యమని, అప్పుడే సైబర్ సురక్షిత సమాజ నిర్మాణంకు మార్గం వేసిన వారం అవుతామన్నారు. టెక్నాలజీతో విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి సైబర్ నేరాలను అరికట్టడానికి యాప్‌లు, డిజిటల్ సాధనాలు రూపొందించ వచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ మనిషా, ఏడీసీపీ టాస్క్‌ఫోర్స్ శ్రీనివాసరావు, మైలవరం ఏసీపీ ప్రసాదరావు, ఎస్సైలు గిరిబాబు, చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ శ్రీనివాస రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ కంపెనీ ఉద్యోగికి రిమాండ్

జగ్గయ్యపేట రూరల్, డిశంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తాను పనిచేస్తున్న సిమెంట్ కంపెనీలో రూ.86 లక్షలకు టోకరా వేసి తప్పించుకు తిరుగుతున్న ఉద్యోగి పాల్వంచ శ్రీనివాసరావును కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ తెలిపారు. కాకతీయ సిమెంట్స్‌లో ఆపరేటర్‌గా పని చేస్తున్న శ్రీనివాసరావు వేతనంలో అక్రమంగా రూ. 86.50 లక్షలు తీసుకున్నాడని కంపెనీ ప్రతినిధి గోపాలకృష్ణంరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్టు తెలిపారు. శుక్రవారం ఉదయం షేర్మహ్మద్‌పేట క్రాస్ రోడ్డు వద్ద హైదరాబాద్ వెళ్లేందుకు యత్నిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు.

బాలికపై లైంగిక దాడి.. పాస్టర్‌పై కేసు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరుసకు మేనమామ అయిన ఓ పాస్టర్ అభం శుభం తెలియని 14 ఏళ్ల బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడటంతో అతడిపై ఇబ్రహీంపట్నం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కొండపల్లికి చెందిన బాలికపై పాల్వంచకు చెందిన పాస్టర్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడేవాడు. బాలిక అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు విషయం తెలుసుకుని చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పాస్టర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నీరసంగా నిరసనలు

(5వ పేజీ తరువాయి)

ఇప్పటి వరకు ఏ పార్టీ కార్యక్రమంలోనూ పాల్గొనలేదు. పెడన నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీచేసిన ఉప్పాల రాము ఆధ్వర్యంలో నిరసన జరిగింది. పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి, వైసీపీ సీనియర్ నాయకుడు అన్నే చిట్టిబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అవనిగడ్డలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్, పామర్రులో మాజీ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన జరిగింది. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాశ్ ఆధ్వర్యంలో నిరసన జరగ్గా, మైలవరంలో జోగి రమేశ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. నందిగామలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు ఆధ్వర్యంలో, జగ్గయ్యపేటలో నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. తిరువూరులో చోటా నాయకుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి 10 నిమిషాల్లోనే ముగించేశారు.

సమాచారం ఇవ్వరేం..

(5వ పేజీ తరువాయి)

లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా చూస్తున్నామని వివరణ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో గతంలో లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాలను వెనక్కు తీసుకునే ప్రతిపాదన కూడా లేదన్నారు. జనవరి 3న రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు లక్ష ఇళ్లను అందించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని గృహనిర్మాణ శాఖ అధికారి వెంకట్రావు తెలిపారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఉమ్మడి జిల్లాలోని అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని జడ్పీ సీఈవో కన్నమనాయుడు తెలిపారు. ఈ నిధులతో జిల్లా వ్యాప్తంగా 1,100 పనులు చేసేందుకు అనుమతులు ఇచ్చామన్నారు. ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ఆరు నెలలకు సంబంధించిన గౌరవ వేతనాన్ని కూడా ప్రభుత్వం విడుదల చేసిందని ఆయన తెలిపారు. గతంలో ఏడాదికి సంబంధించిన గౌరవ వేతనం బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటి సర్వే జరుగుతోందన్నారు.

3.50 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

తేమశాతం పేరుతో దళారులు, మిల్లర్లు ధాన్యం మద్దతు ధరలో కోతపెట్టి రైతులను మోసం చేస్తున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ధాన్యంలో తేమశాతం 21 పాయింట్లు ఉన్నా, పూర్తిస్థాయి మద్దతు ధరను ఇస్తామని ప్రభుత్వం చెప్పినా, ఎక్కడ అమలు కావడంలేదని సభ్యులు అధికారులను నిలదీశారు. నిబంధనల మేరకే జిల్లాలో ధాన్యం కొనుగోలు జరుగుతోందని, ఇప్పటివరు 3.50 లక్షల టన్నుల ధాన్యాన్ని కొన్నామని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. అనంతరం విద్య, వైద్యం, స్త్రీ, శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్ష జరిగింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల అధికారులు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	113,121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

224 మందికి వైద్య సేవలు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ సందర్భంగా ప్రజాశక్తినగర్ బ్రాంచ్ వద్ద దీపక్ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ ముక్తినేని వెంకట మధుసూదనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 224 మందికి వైద్య సేవలందించినట్లు ఎండీ పి.సురేష్ కుమార్ తెలిపారు. ఈ శిబిరాన్ని వేమూరి బలరామ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దుగ్గిరాల పూజిత చౌదరి, డాక్టర్ జాగర్లమూడి మనోజ్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయుల ఆవాస గృహానికి మహర్దశ

(రాణిగారితోట, ఆంధ్రజ్యోతి)
నగరానికి పనుల కోసం వచ్చే వారితో పాటు ఏ దిక్కూలేక ఏదో ఒక పని చేసుకునే నిరాశ్రయుల కోసం మున్సిపల్ కార్పొరేషన్ నగరంలో ఏర్పాటు చేసిన నిరాశ్రయుల ఆవాస గృహాలు మంచి

రాణిగారితోట గృహంలో వసతుల కల్పన

ఫలితాలు ఇస్తున్నాయి. రాణిగారితోట సిమెంట్ గౌడ్‌లో ఏర్పాటు చేసిన ఈ గృహం చాలా మంది నిరాశ్రయులకు ఆశ్రయం కల్పిస్తోంది. అయితే గత కొంత కాలం నుంచి ఇక్కడ అనేక సమస్యలు తాండవిస్తుండడంతో ఆశ్రయం పొందుతున్న వారి ఇబ్బందులు వర్ణనాతీతం. చిరిగిన దుప్పట్లు, పాడైన పరుపులు, పని చేయని సీసీ కెమేరాలు, పాడైన ఫ్యాన్లు ఇలా లోపల అడుగు పేడితే సమస్యలు స్వాగతం పలికేవి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యలపై అటు వైసీపీ నాయకులు , ఇటు కార్పొరేషన్ అధికారులు స్పందించిన దాఖలాలు లేవు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సమస్యలపై దృష్టి సారించిన వీఎంసీ అధికారులు పరిష్కారానికి నడుం బిగించారు. దీనిలో భాగంగా ఇటీవల మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర రాణిగారి తోట పర్యటనలో భాగంగా ఈ గృహాన్ని సందర్శించగా ఇక్కడి సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.



ఆవాస గృహం బయట ఆహ్లాదకరంగా వేసిన చిత్రాలు



కొత్త పరుపులు, దిండ్లు

వెంటనే ఆయన సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించడంతో నిరాశ్రయుల గృహానికి మహర్దశ పట్టింది. కమిషనర్ ఆదేశాలతో పై అధికారులు వెంటనే ఈ గృహాన్ని అభివృద్ధి చేశారు.

ఆవాస గృహంలో అభివృద్ధి పనులు

కమిషనర్ ఆదేశాలతో అధికారులు ఇక్కడి పనులు పూర్తిచేశారు. గృహం లోపల, బయట పెయింట్లు, బయట గోడలకు అందమైన చిత్రాలు, రేకులపై తారుషీట్లు, మరుగుదొడ్ల మరమ్మతులు, ఫ్యాన్లు, మంచాలకు పెయింట్లు, కొత్త పరుపులు, దిండ్లు, దుప్పట్లతో పాటు అవసరమైన అన్ని వసతులు కల్పించారు. గతంలో టీవీ, సీసీ కెమేరాలు ఉండేవి ప్రస్తుతం వాటిని ఏర్పాటు చేయలేదు. త్వరలోనే వీటిని కూడా ఏర్పాటు చేస్తారని సమాచారం.

మున్సిపల్ కమిషనర్ చొరవతోనే..

తమ సంస్థకు నిర్వహణ బాధ్యతలు వచ్చిన వెంటనే ఇక్కడి సమస్యలు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన స్వయంగా పరిశీలించి వెంటనే అభివృద్ధి పనులు చేయించారు. ఇంకా టీవీ, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాల్సి ఉంది, త్వరలోనే వాటిని ఏర్పాటు చేయడం జరుగుతుంది. వాషింగ్ మిషన్ మరమ్మతులకు గురైంది. దానిని కూడా బాగుచేయిస్తాం. నగరానికి వచ్చే వారికి ఈ ఆవాస గృహం ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఇక్కడ ఏ సమస్యలు ఉన్నా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం. - వై.కోటేశ్వరి, పూజిత మహిళా సొసైటీ ప్రెసిడెంట్

మంచి లక్ష్యంతో ఏర్పాటు చేశారు



మంచి లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆవాస గృహం నగరానికి వచ్చే నిరాశ్రయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ గృహం తమ డివిజన్ పరిధిలో ఉండడంతో ఇకపై దీనిపై దృష్టి సారిస్తాం. ఏ సమస్య ఉన్నా తమ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా చూస్తాం. వారధి సమీపంలో ఉండడంతో ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంది.
- కొక్కెర తిరుపతయ్య, టీడీపీ నాయకులు

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● నాయి బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి



చిట్టినగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమవుతుందని నాయీ బ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. శుక్రవారం భీమన్నవారిపేట లోని వాల్మీకి భవనం వద్ద స్థానిక నాయీ బ్రాహ్మణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇందులో భాగంగా బీసీల కోసం బడ్జెట్లో రూ.39వేల కోట్లు కేటాయించారన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ.15వేల వేతనాన్ని రూ.25 వేలకు టీడీపీ పెంచిందన్నారు. బీసీ విద్యార్థుల కోసం జిల్లా కేంద్రాల్లో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని, గొల్లపూడిలో ఐఏఎస్ స్టడీ సెంటర్‌ను ప్రారంభించారని చెప్పారు. త్వరలో 16,437 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నవిరి మహేష్, రాము, దుర్గారావు, రామారావు, గణపతి పాల్గొన్నారు.

డాక్టర్ బండి - 'నిర్వాణ' గ్రంథావిష్కరణ



గ్రంథావిష్కరణ చేస్తున్న మాజీ ఐఏఎస్ అధికారి ఇంతియాజ్, నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ జీఆర్కే, పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత నాటకకర్త, ప్రయోక్త డాక్టర్ బండి సత్యనారాయణ రచించిన నిర్వాణ (నవల) గ్రంథావిష్కరణను ఏఎండీ ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతికి, ప్రశాంతతకు బుద్ధుడు ప్రతీకన్నారు. ఈ గ్రంథాన్ని సత్యాజి సమీక్షించారు. జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి కార్యదర్శి గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ బుద్ధుని బోధనలు నేటికి అనుసరణీయమని, ఆచరణీయమని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ నిర్వాణ నవల బుద్ధుని బోధనలను ప్రసిద్ధంగా తెలియజేస్తుందని, పాఠకులు తప్పనిసరిగా చదవదగిన గ్రంథమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బుద్ధ ధర్మ సంఘం విజయవాడ కన్వీనర్ వీఎస్‌పీ నరేంద్రనాథ్, రేకా కృష్ణార్జున బోధి, భూగర్భజల, జనగణన శాఖ విజయవాడ సహాయ సంచాలకులు ఎ.విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం
మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరి సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

తొమ్మిదో రోజుకు చేరుకున్న లయోలా వాకర్స్ నిరసన

భారతీనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం మొండివైఖరిని వ్యతిరేకిస్తూ, కళాశాల గ్రౌండ్‌లో వాకింగ్‌కు అనుమతిని కోరుతూ లయోలా వాకర్స్, అమరావతి వాకర్స్ చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారంతో తొమ్మిదో రోజుకు చేరుకుంది. లయోలా వాకర్స్, మాచవరం వాకర్స్, పటమట వాకర్స్, స్టేడియం వాకర్ల సభ్యులు శాంతియుత నిరసన చేశారు. ఈ కార్యక్రమానికి ఆక్వా డెవిల్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి వచ్చి వారికి మద్దతు తెలిపారు. శనివారం ఉదయం 6గంటల నుంచి 30 నిమిషాలపాటు లయోలా కళాశాల మెయిన్ గేట్ వద్ద నిరసన కొనసాగించి, ఆ తరువాత అమరావతిలో వెంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని తమ ప్రయత్నాలు ఫలించాలని ప్రార్థించాలనుకుంటున్నట్లు వాకర్ల ప్రతినిధులు తెలిపారు.

దత్తపీఠానికి చేరిన సచ్చిదానంద స్వామీజీ



గన్నవరం విమానాశ్రయంలో గణపతి సచ్చిదానంద స్వామికి స్వాగతం పలుకుతున్న భక్తులు

పటమట, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): దత్తక్రైతనాదయాత్ర 2025లో భాగంగా గణపతి సచ్చిదానందస్వామీజీ మైసూరు నుంచి శుక్రవారం విజయవాడ దత్తపీఠానికి చేరుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు శ్రీపాదుకరాగ సాగర్ మ్యూజికల్ హీలింగ్ కాన్సెట్ జరుగుతుందని దత్తపీఠం నిర్వాహకులు తెలిపారు. స్వామిజీ సమక్షంలో 2025 నూతన సంవత్సర వేడుకలు జనవరి 1న పటమట దత్తపీఠంలో జరుగుతాయని, 2న దత్తాత్రేయ నూతన విగ్రహ ప్రతిష్ఠ, శ్రీగంగాధరేశ్వర శివలింగ ప్రతిష్ఠ, నాగేంద్ర విగ్రహ ప్రతిష్ఠ జరగనుందని, 3న భగవత్ గీతాపారాయణం, విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం, 4న ఉదయం 11 గంటలకు గంగాధరరాగ సాగర్ మ్యూజిక్ హీలింగ్ జరగనుందని 5న దత్తాత్రేయునికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నప్రసాదర వితరణ జరుతుందని దత్తపీఠం నిర్వాహకులు తెలిపారు.

కోస్టల్ బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



బ్యాంకు అందించిన సేవలపై సావనీర్ ఆవిష్కరిస్తున్న బ్యాంక్ అధికారులు

లబ్బీపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రానున్న కాలంలో తమ బ్యాంకు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుగా మారనుందని కోస్టల్ లోకల్ ఏరియా బ్యాంక్ ఎండీ, సీఈఓ బి.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బ్యాంక్ సిల్వర్ జూబ్లీ వేడుకలు బందర్‌రోడ్డులోని ఫార్చ్యూన్ మురళి హోటల్‌లో శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా ఆయన ఈ 25సంవత్సరాల కాలంలో బ్యాంకు అందించిన సేవలపై సావనీర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ 1999లో బ్యాంకును ప్రారంభించడం జరిగిందని, ఆనాటి నుంచి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందుతున్నామని అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో 120శాఖలను విస్తరించాలని లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. బ్యాంక్ చైర్మన్ కె.వెంకట రామన్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బ్యాంకింగ్ సేవలు నూతన సాంకేతిక ఆవిష్కరణలు తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు ఏఎస్ అప్పయ్య, తిమ్మిశెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదం జరిగే వరకు పట్టించుకోరా ?

● ఒరిగిన సూచిక బోర్డు ● వాహనదారుల ఆందోళన



ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ దంత వైద్యశాల, కళాశాల సమీపంలో రహదారిపై దంత వైద్యశాల వారు ఏర్పాటు చేసిన ఆసుపత్రి అడ్రస్ తెలిపే సూచిక బోర్డు ఒరిగిపోయి ప్రమాదభరితంగా ఉంది. ఇలా ఒరిగిపోయిన బోర్డు వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పలువురు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇటు ఆసుపత్రి వారు కాని ఇటు అధికారులు కాని బోర్డును సరిచేద్దామనే ఆలోచన చేయడం లేదు. ప్రమాదం జరిగే వరకు స్పందించరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి బోర్డును సరి చేయించాలని పలువురు కోరుతున్నారు.

కానూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ రేపు



కానూరులో ఆవిష్కరించనున్న ఎన్టీఆర్ విగ్రహం

పెనమలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కానూరు శ్రీరాంనగర్ కాలనీలో ఈ నెల 29న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేయనున్నట్లు విగ్రహ కమిటీ బాధ్యులు, టీడీపీ నాయకులు చలసాని హిమకిరణ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని విగ్రహావిష్కరణ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కానూరులో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పార్టీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఎం ఇంటింటా ప్రచారం



ఇంటింటా ప్రచారం చేస్తున్న సీపీఎం నేతలు

పటమట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపుపై, స్మార్ట్‌మీటర్లు పెట్టొద్దని కరపత్రాలతోను, గ్రూప్ మీటింగ్‌లతో సీపీఎం పటమట లంక ప్రాంతంలో ఇంటింటా ప్రచారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో సీపీఎం తూర్పు నగర కార్యదర్శి పి. కృష్ణ మాట్లాడుతూ ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తప్పుతోందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజలపై రూ.15,484 కోట్ల సర్దుబాటు చార్జీలు వేశారని ఆరోపించారు. పాత మీటర్ల స్థానంలో కొత్త స్మార్ట్ మీటర్లు పెట్టాలని ప్రభుత్వం సిద్ధంగా ఉందని విమర్శించారు. విద్యుత్ ప్రైవేటీకరణ చేయొద్దని సీపీఎం ప్రచారం చేపట్టిందన్నారు. జనవరి 7న ఉదయం 10 గంటలకు ఏ కన్వెన్షన్ బృందావన్ కాలనీ దగ్గర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రభుత్వ అధికారులతో, ప్రజలతో చర్చించనున్నారని, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిద్దాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర నాయకులు వి. గురుమూర్తి, వి. వరప్రసాద్, వీబీ రాజు, పి. మల్లిఖార్జునరావులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పొందాలి

● 5వ ట్రాఫిక్ స్టేషన్ సీఐ రవికుమార్



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

మొగల్రాజపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని అపుడే భవిష్యత్‌లో ప్రమాదాలు తగ్గడానికి ఆస్కారం ఉంటుందని 5వ ట్రాఫిక్ స్టేషన్ సీఐ రవికుమార్ హితవు పలికారు. మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత, ప్రమాద రహిత ప్రయాణం, హెల్మెట్ అవశ్యకతను తెలియజేశారు. బస్‌లలో ప్రయాణం చేసేటపుడు కిటికీల నుంచి చేతులు బయట పెట్టరాదని, లైసెన్సు లేకుండా, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దన్నారు. సిగ్నల్స్‌ను చూసి రోడ్డు దాటాలని, వాహనం నడిపేటపుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడవద్దని, సైబర్ క్రైం నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఏటీఎం, బ్యాంకు ఖాతాల పిన్ నెంబర్లు చెప్పవద్దని సూచించారు. వీఐపీలు, వీవీఐపీలు ప్రయాణం చేసేటపుడు ట్రాఫిక్ పోలీసులు తీసుకునే చర్యలను చెప్పారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య, ట్రాఫిక్ ఆర్‌ఎస్ఐ వెంకటకుమార్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా మారిన బస్‌షెల్టర్



భారతీనగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): డెంటల్ ఆస్పత్రి రోడ్డులో ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరి వద్ద ఉన్న బస్‌షెల్టర్ నిరుపయోగంగా మారింది. ఈ బస్‌షెల్టర్‌ను కొందరు యాచకులు నివాసంగా ఏర్పాటు చేసుకొని ఉంటున్నారు. వీళ్ల పగలు, రాత్రి అక్కడే ఉండడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రయాణికులు బస్‌షెల్టర్‌లోకి వెళ్లడానికి వీలు లేకుండా అడ్డంగా ఉండడంతో చేసేది లేక వారు ఎండలో నిలబడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

GRAND GALA 2ND WEEK at NAVRANG A/c



తెలుగు - 3D, రోజూ 4 ఆటలు
11:45 AM, 3:00 PM, 6:45 PM, 9:45 PM
ADVANCE BOOKING OPEN ONLINE " BOOK MY SHOW"

RUNNING TO PACKED HOUSES
తెలుగు రాష్ట్రాలలో హిందీ వెర్షన్‌కు అద్భుత స్పందన. అసాధారణ వసూళ్ళు..



హిందీ వెర్షన్
విజయవాడ: క్యాపిటల్ సినిమాస్ 2-00 PM, 7-50 PM
విజయవాడ :
ఊర్వశి INOX 10-40 pm
PVR INOX 4-30 pm
LEPL INOX 10-30 pm
Zineeverse Motion picture (P) Ltd. release
Cell : 78937 22277

2వ వారం
అప్సర సినిమా



MUFASA
తెలుగు - 2D
రోజూ 4 ఆటలు :
11-45AM, 2-45PM, 6-45PM, 9-45PM
www.justickets.in
www.bookmyshow.com



అన్నపూర్ణ కాంప్లెక్స్	- విజయవాడ
LEPL ఐనాక్స్	- విజయవాడ
పివిఆర్ సినిమాస్	- విజయవాడ
క్యాపిటల్ సినిమాస్	- విజయవాడ
సాయిరాం ప్లెక్స్	- విజయవాడ
బాలాజీ	- గుడివాడ
పివిఆర్ సినిమాస్	- మచిలీపట్నం
గగన్ మహల్	- పామర్రు
నటరాజ్	- బంటుమిల్లి

Contact:9866010970



Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets : paytm TICKETNEW
NOW SHOWING



BABY JOHN (U/A) (HIN) 10:00 AM,1:25 PM 4:15 PM,7:55 PM,11:00 PM
MAX (U/A) (TEL) 11:15 AM,1:00 PM,7:30 PM
PUSHPA THE RULE PART 2 (U/A) (TEL) 10:15 AM,2:10 PM,3:40 PM,6:00 PM,9:50 PM
MUFASA THE LION KING - 3D (U) (TEL) 10:20 AM,12:50 PM,3:20 PM,5:50 PM,8:20 PM
UI (U/A) (TEL) 10:40 AM, 7:50 PM
MUFASA THE LION KING - 2D (U) (TEL) 11:10 AM,1:40 PM,4:10 PM,10:50 PM
MUFASA THE LION KING - 3D (U) (E) 10:10 PM
MARCO (A) (HIN) 4:40 PM, 10:30 PM
BARROZ (U) 3D (TEL) 11:40 AM, 7:35 PM
SRIKAKULAM SHERLOCKHOLMES (A) (TEL) 5:00 PM, 11:05 PM
DRINKER SAI (A) (TEL) 1:20 PM
*NOTE: Timings are subject to change without any prior notice.

ఆంధ్రజ్యోతి
డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

TO-LET COMMERCIAL
» సూరంపల్లి - నూజివీడు రోడ్డులో ALEAP ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో 8,400 S.Ft. 3 స్టేర్స్ బిల్డింగ్ కమర్షియల్ లిఫ్ట్‌తో గోడౌన్స్‌కు అద్దెకు సంప్ర. 94401 74206, 98854 61108
AJB - 225441

FLAT FOR SALE
» గొల్లపూడి ఒన్ సెంటర్ పోస్టాఫీసు రోడ్డులో గ్రూప్ హౌస్ ఫస్ట్ ఫ్లోర్, నార్త్ ఫేసింగ్ 2BHK అమ్మబడును. 2వీలర్ పార్కింగ్ 25 లక్షలు మాత్రమే © 96666 94418
AJB- 36

PLOT FOR SALE
» కేసరిపల్లి To సావారిగూడెం నందు ఇల్లు కట్టుకోవటానికి అనుకూలంగా ఉన్న Plots కలవు. చ.గ రూ. 7,500/-. సంప్ర. 93469 18356
AJB - 748

» అమరావతి రాజధానికి దగ్గరలో పొన్నెకల్లు వద్ద 40 ఎకరాల CRDA లే-ఔట్ & AIIMS ఎదురు రోడ్డులో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌లు, ఫ్లాట్స్ కలవు. సెల్ : 90522 72828, 83672 82709
AJB - 407

TO-LET
» కృష్ణలంక, గుండుకోటయ్య వీధి, SBI రోడ్‌లో పూర్తి ఫర్నిచర్‌తో A/C రూమ్స్, GF లో 4 రూమ్స్ ఆఫీసులకు, గోడౌన్‌కు, ఫ్యామిలీస్‌కు నెలవారి అద్దెకు. సంప్ర:83099 04493
AJB- 743

WANTED
» గూడవల్లి ఆటోనగర్ మరియు VJA సిటీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఒంటరి వారికి వసతి సౌకర్యం. సంప్ర: 92472 71222, 96423 13999.
AJB - 727

» విజయవాడలో పనిచేయుటకు పురుష సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటలు డ్యూటీ. జీతం 15000 + PF + ESI సెల్: 73861 78618, 83412 46778
AJB- 225287

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ.290/- 30% EXTRA
1 టౌన్: 99854 09286, పటమట: 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి: 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్: 99854 11733, గన్నవరం, కంకిపాడు: 99854 11733, 99854 09240

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?
మీ కుటుంబ సభ్యులలో మీ బంధుమిత్రులలో మీ సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా 'ఆంధ్రజ్యోతి' ద్వారా అందించండి ఆత్మీయ శుభాకాంక్షలు
GST 5% Extra
ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
సిటీ / జిల్లా ప్రకటనలకు 25% డిస్కౌంట్
జోన్ ప్రకటనలకు 15% డిస్కౌంట్
పటమట : 99854 11868, 1 టౌన్ : 99854 09286
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, పెనమలూరు : 99854 09240
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
© 99854 11868, 99854 85777

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
© సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234





కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠం విద్యార్థుల అభినయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కళాకారులు

సిద్ధేంద్రయోగికి నాట్య నీరాజనం

అట్టహాసంగా కూచిపూడి నాట్యోత్సవాలు ప్రారంభం

కూచిపూడి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): కూచిపూడి హెరిటేజ్ సొసైటీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కేంద్ర సాంస్కృతిక శాఖ, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ మిషన్ సహకారంతో సిద్ధేంద్ర కళాపీఠంలో కూచిపూడి స్వర్ణోత్సవాల పేరిట ఏర్పాటు చేసిన కూచిపూడి నాట్యోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులతో పాటు ప్రవాస భారతీయులు నాట్యప్రదర్శనలతో సిద్ధేంద్రయోగికి నాట్య నీరాజనా లు అర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి నాట్య కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో అం బాపరాకు, దేవి పరాకు, గణపతి నర్తనం అంశాలతోపాటు మోహిని భస్మాసుర నృత్యరూపకం ప్రదర్శించి ప్రేక్షకులను రంజింపచేశారు. మృణాళిని సలాది శిష్యబృందం బాలార్క కోటి అంశాన్ని కల్యాణరాగం, ఆదితాళంలో ప్రదర్శించి మెప్పించారు. పసుమర్తి మృత్యుంజయశర్మ సూర్య స్తుతి అంశాన్ని శౌరాష్ట రాజ్యం, రూపకతాళంలో చూపిన హావభావాలు ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని గావించాయి. పద్మరాగిని పుట్టు బృందం పరిపాహి గణదిపా, జగదానంద కారక అంశాలను, నాగజ్యోతి శివతరంగం అంశాన్ని, జయజయదుర్గే, నారాయణ తీర్థుల తరంగం అంశాలను సుధీర్‌రావు ప్రదర్శించారు. మహాగణపతిం, ఆడరో, పాడరో అన్నమాచార్య కీర్తనను జ్వాలశ్రీ కళ ప్రదర్శించారు. పసుమర్తి రామలింగశాస్త్రి శిష్య బృందం యామినీరెడ్డి, కేపీ విశ్వనాథ్ అర్ధనారీశ్వర స్తోత్రం, అఖిలాండేశ్వరి అంశాలను ప్రదర్శించి మెప్పించారు. మాడబూసి రమణసిద్ధి శిష్యబృందం అముక్తమాల్యద నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం నాగ వెంకటచలపతి కళాకారులను సత్కరించారు. సర్పంచ్ కొండవీటి విజయలక్ష్మి, కళాకారులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలు ప్రారంభించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికారణంగా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారు లు హాజరు కాలేకపోయారు.



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

చిరస్మరణీయుడు మన్మోహన్‌సింగ్

» మాజీ ప్రధాని పార్థివదేహానికి ఎంపీ కేశినేని చిన్ని నివాళి

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ఆర్థిక సంస్కరణలకు పెద్దపీట వేయడంతో పాటు, పలు రంగాల్లో కీలకమైన సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దిగ్భ్రాంతి కలిగించింది. దేశం గొప్ప దార్శనికుడిని కోల్పోయింది. ప్రధాన మంత్రిగా, కేంద్ర ఆర్థికశాఖ మంత్రిగా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ) గవర్నర్‌గా, ఆర్థికవేత్తగా దేశానికి మన్మోహన్‌సింగ్ అందించిన సేవలు చిరస్మరణీయం. ఆయన మరణం దేశానికి తీరనిలోటు.' అని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శుక్రవారం ఢిల్లీలో మన్మోహన్‌సింగ్ పార్థివదేహానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సహచర ఎంపీలతో కలిసి కేశినేని చిన్ని నివాళులర్పించారు. మన్మోహన్ సతీమణి గురుశరణ్ కౌర్‌తో పాటు కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

» సౌత్‌జోన్ ఆక్వాటిక్స్ పోటీల ప్రారంభోత్సవంలో శాప్ చైర్మన్ రవినాయుడు



మాట్లాడుతున్న రవినాయుడు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని, అందుకు అనుగుణంగా అంకితభావంతో పనిచేస్తున్నామని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు స్పష్టం చేశారు. నగరంలోని గాంధీనగర్ సర్‌విజ్జీ వీఎంసీ స్విమ్మింగ్‌పూల్‌లో 35వ సౌత్‌జోన్ ఆక్వాటిక్స్ చాంపియన్‌పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లా అమెచ్యూర్ ఆక్వాటిక్స్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాల స్విమ్మర్లు పాల్గొన్నారు. నేషనల్ ఆక్వాటిక్స్‌లో సత్తా చాటి పతకాలు సాధించిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలను రవినాయుడు అందజేశారు. మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీల్లో 600 మంది స్విమ్మర్లు పాల్గొంటున్నారని కార్యనిర్వాహక కార్యదర్శి ఐ.రమేష్ తెలిపారు. డీఎస్‌డీవో ఎస్ ఏ అజీజ్, ఆక్వాటిక్స్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గోవిందరాజు, కార్యదర్శి ఎ.మోహన్ వెంకటరామ్, కృష్ణాజిల్లా ఆక్వాటిక్స్ చైర్మన్ యలమంచిలి వెంకటసురేష్, స్విమ్మింగ్ అసోసియేషన్ చైర్మన్ రమేష్‌జైన్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ కొంగర రవికాంత్, వీఎంసీ స్పోర్ట్సు అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



అంతరాలయంలో భక్తులు

దుర్గగుడిలో భక్తుల రద్దీ

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు కుటుంబాలతో సహా తరలివచ్చారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్రస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి కొండపైకి చేరుకున్నారు. పొంగళ్లు సమర్పించారు. నిత్య ఆర్జిత సేవలైన అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, చండీహోమం, శాంతి కల్యాణం కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం శీఘ్రంగా అయ్యేందుకు ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజులు, సిబ్బంది ప్రణాళిక ప్రకారం క్యూలైన్లలో భక్తులను పంపారు.

విజయవాడ రైల్వే డివిజన్‌లో రూ.79.60 కోట్ల స్క్రాప్ విక్రయాలు

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ రూ.79.60 కోట్ల స్క్రాప్ విక్రయించిందని, లక్ష్యాన్ని అధిగమించిందని డివిజన్ రైల్వే కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. '2024-25 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరు 25 నాటికి 14,272 మెట్రిక్ టన్నుల స్క్రాప్ మెటీరియల్‌ను విక్రయించింది. రూ.79.60 కోట్లు ఆర్జించింది. రైలు స్క్రాప్, ఎస్, టీ, ఇంజనీరింగ్ వ్యర్థాలు, ఇనుము, ఉక్కు, ఇతర లోహాల స్క్రాప్‌ను విక్రయించటం ద్వారా ఆర్థిక సంవత్సరం ముగియడానికి మూడు నెలల ముందుగానే నిర్ణీత లక్ష్యాలను అధిగమించాం.' అని కార్యాలయం పేర్కొంది. సీనియర్ డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్ కె.బి.తిరుపతయ్యను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ అభినందించారని, డివిజన్‌ను స్క్రాప్‌రహితంగా తీర్చిదిద్దాలని సూచించారని తెలిపింది.

ప్రమాదాలకు దారిచూపేలా..

వాహనాల్లో హైబీమ్ ఎల్ఈడీ లైట్ల వినియోగం

నగరంలో కార్లు, ద్విచక్రవాహనాలు అనే తేడా లేకుండా ఎల్‌ఈడీ లైట్ల వినియోగం పెరిగిపోతోంది. వాహనాల రీమోడలింగ్‌లో భాగంగా హెడ్ లైట్ల కోసం ఎల్‌ఈడీ బల్బులను వినియోగిస్తున్నారు. ఎల్‌ఈడీ లైట్ల వినియోగాన్ని అధికారులు నియంత్రించలేకపోవడంతో రీమోడలింగ్ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎక్కువ కాంతినిచ్చే ఎల్‌ఈడీ లైట్ల వినియోగంలో నియంత్రణ ఉంది. కానీ అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో అధిక సంఖ్యలో వాహనదారులు కంపెనీ అమర్చిన లైట్లు కాకుండా రెండు హెడ్‌లైట్లకు మధ్య ఎక్కువ కాంతినిచ్చే ఎల్‌ఈడీ లైట్లు అమరుస్తున్నారు. ఇలా అమర్చడం మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘన అవుతుంది.





కారుకు ఏర్పాటు చేసిన ఎల్‌ఈడీ లైట్, వాహనాన్ని రీమోడలింగ్ చేస్తున్న మెకానిక్‌లు

» లైట్ల నుంచి వస్తున్న కాంతి తీవ్రతకు ఎదురుగా వస్తున్న వాహనదారులకు మసకబారుతున్న కళ్లు

» మోటార్ వెహికల్ యాక్టు ఉల్లంఘిస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి-ఆటోనగర్): నగరంలో కొందరు వాహనయజమానులు కొత్తగా తీసుకున్న కార్లకు, ద్విచక్ర వాహనాలకు ఇష్టారీతిన రీమోడలింగ్ చేసేస్తున్నారు. బీఎస్-6 వాహనాలకు హెడ్‌లైట్లు మార్చే అవకాశం లేదు. దీంతో కొందరు అదనపు లైట్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కంపెనీలు తయారు చేసి ఇచ్చే ఎల్‌ఈడీ లైట్ల వల్ల ఎలాంటి సమస్య ఉండదని, రీమోడలింగ్ పేరుతోనో, లైటింగ్ సరిగా లేదనో మార్చుకునే అధిక కాంతినిచ్చే లైట్ల వల్లేనే ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇన్సూరెన్స్ క్లయిమ్‌లో ఇబ్బందులు

ఎల్‌ఈడీ లైట్ల వల్ల ఇన్సూరెన్స్ క్లయిమ్‌లోనూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నియమ నిబంధనలు ప్రకారం క్లయిమ్‌లు తిరస్కరణకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని ఇన్సూరెన్స్ కంపెనీలు చెబుతున్నాయి. సాధారణ ఎల్‌ఈడీ లైట్ల అమరికలో వాహనదారులు, తయారీ సంస్థలకూ ఎలాంటి ఆంక్షలు లేవు.

ఎల్ఈడీల వాడకం పెరగడానికి కారణాలు

ఎల్‌ఈడీ హెడ్‌లైట్లను వినియోగించడం వల్ల దూరంగా ఉన్నవి స్పష్టంగా కనిపిస్తాయని, బ్యాటరీ పవర్ ఆదా అవుతోందని ఎల్‌ఈడీ లైట్ల వోల్ట్స్‌ని బట్టి బ్యాటరీ వినియోగం మారుతుందని వాహనదారులు చెబుతున్నారు. కానీ, ఎక్కువ వోల్ట్స్ పవర్ ఉన్న లైట్లను వినియోగిస్తే బ్యాటరీల మన్నిక తగ్గుతుందని మెకానిక్‌లు చెబుతున్నారు. కొంత మంది తమ వాహనాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు ఈ లైటింగ్ సిస్టమ్‌ను వాడుతున్నారు. కార్ల లోపల రీమోడలింగ్ చేయిస్తున్నారు. వాహనంలో గీతాలు వినేటప్పుడు శబ్దానికి అనుగుణంగా లైట్లు వెలిగేలా మార్పులు చేయిస్తున్నారు. కార్ల కంపెనీలు అందించే ఫాగ్ ఎల్‌ఈడీ ల్యాంపులు సైతం మార్చేస్తున్నారు. తమ వాహనాలు ఆకర్షణీయంగా కనిపించాలని హంగులు ఆర్భాటాలతో ఇతరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు.

హైబీమ్ ఎల్ఈడీ లైట్లతో ప్రమాదమే..

రాత్రి వేళల్లో సింగిల్ రహదారిలో ఎక్కువ కాంతినిచ్చే ఎల్‌ఈడీ లైట్లున్న వాహనాలు వచ్చినప్పుడు కళ్లు మసకబారి ఎదురుగా వచ్చే డ్రైవర్లు ఇబ్బంది పడుతుంటారు. వేగంగా వెళ్లేటప్పుడు వాహనాన్ని నియంత్రించడం కష్టమవుతుంది. దీంతో కొంతమంది వాహనదారులు ఆకస్మాత్తుగా బ్రేకులు వేయడం, మరికొంత మంది వేగాన్ని నియంత్రిచడానికి రహదారి పక్కకు వెళ్లడం జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లోనే ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వాహనదారులు లోబీమ్ లైట్లను వినియోగిస్తే ప్రమాదాలు నియంత్రించవచ్చని చెబుతున్నారు.

లైటింగ్ సిస్టం బాగున్నా..కావాలనే పెట్టుకుంటున్నారు

కొత్త రకం కార్లకు లైటింగ్ సిస్టం బాగానే ఉంటుంది. కానీ కొంతమంది ఎక్కువ కాంతినిచ్చే లైట్లు కావాలని మార్చుకుంటారు. ఇప్పుడు వస్తున్న వాహనాలకు హెడ్‌లైట్లు మార్చడం కుదరదు. కానీ ఎక్కువ కాంతినిచ్చే లైట్లను విడిగా అమర్చవచ్చు. దీనిపైన మాకు ఎలాంటి నియంత్రణ ఉండదు. ఎల్‌ఈడీ బల్బుల్లో మోడల్, వోల్ట్స్‌ని బట్టి వాటి ధర రూ.8 వేల నుంచి రూ.20 వేల వరకు ఉంటుంది. లగ్జరీ కార్లకు ఇంటీరియల్ లైటింగ్ సిస్టమ్ కూడా పెట్టుకుంటున్నారు.

-సంతోష్, మెకానిక్

ప్రమాదమే.. అయినా వినియోగదారులు పట్టించుకోరు

ఎల్‌ఈడీ బల్బులు కేవలం కాంతి కోసమే వినియోగించడం లేదు. బయట బిగించే లైటింగ్ ఆకర్షణీయంగా ఉండాలని, వాహనం కదిలినప్పుడు ఓ రకంగా, పాటలు వినేటప్పుడు మరో రకంగా వెలిగేలా ఉండాలని, ఇతరులు తమ వాహనం వెళ్తుంటే చూడాలని వినియోగదారుడు కోరుకుంటున్నాడు. అందు కోసమే ఎల్‌ఈడీ బల్బులు పెట్టుకుంటున్నారు. వినియోగదారులను సంతృప్తి పరచడమే మా ప్రాధాన్యం. ఎల్‌ఈడీ లైటింగ్ వల్ల ఇతరుల ప్రాణాలకు ప్రమాదమే. కానీ వినియోగదారులు అది ఆలోచించరు.

-మహేశ్వరరావు, మెకానిక్

లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ పరం చేయొద్దు

» సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ డిమాండ్



ఆటో మోటారు కార్మికుల సమస్యలపై లెనిన్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ నేతలు, కార్మికులు

గవర్నర్‌పేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్‌పరం చేయడం వల్ల మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకుడు కె.దుర్గారావు అన్నారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని నిరసిస్తూ ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల ఫలితంగా ఆటో మోటారు రంగ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. లైసెన్సులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల మోటారు కార్మికులపై మరింత భారం పడుతుందని, ప్రజలకు రక్షణ లేకుండా పోతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ప్రభుత్వ అధీనంలోనే వీటి జారీ విధానం ఉండాలని కోరారు. ఆటో కార్మికుల కుటుంబాలు సరైన కిరాయిలు లేక పూట గడవడమే కష్టంగా మారిందని, ఎన్నికల ముందు టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకుని ఆటో, మోటారు కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తూర్పు సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.రూబెన్‌కుమార్, సెంట్రల్ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, సిటీ వర్కర్స్ యూనియన్ నాయకులు కోటయ్య, నాగబ్రహ్మం, సూర్యనారాయణ పాల్గొన్నారు.

వీఆర్‌లోకి ఎస్ఎన్‌పురం ఇన్‌స్పెక్టర్

» కొత్త ఇన్‌స్పెక్టర్‌గా లక్ష్మీనారాయణ

విజయవాడ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురం ఇన్‌స్పెక్టర్ వై.బాలరాజాజీని వీఆర్‌లోకి పంపుతూ పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాలరాజాజీ తరచుగా సెలవులు పెడుతుండడంతో సీపీ ఈ నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలో ఉన్న ముఖ్యమైన పోలీసు స్టేషన్లలో సత్యనారాయణపురం ఒకటి. కీలకమైన ఈ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వోగా ఉన్న అధికారి తరచుగా సెలవుల్లో వెళ్లడం వల్ల ఇబ్బందిగా ఉంటోందని అధికారులు సీపీకి వివరించారు. ఇంతకుముందు రాజాజీ సెలవులో వెళ్లారు. తాజాగా ఈనెల 23 నుంచి నెల రోజులపాటు మెడికల్ లీవ్ పెట్టారు. అప్పటి వరకు ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్‌ను నియమించడం కంటే కొత్త ఇన్‌స్పెక్టర్‌ను నియమించడం మంచిదన్న నిర్ణయానికి పోలీసు కమిషనర్ వచ్చి రాజాజీని వీఆర్‌లోకి పంపారు. ఖాళీ అయిన ఈ స్థానంలోకి సీసీఎస్‌లో ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న ఎస్వీవీ లక్ష్మీనారాయణను నియమించారు. లోగడ ఈయన అజిత్‌సింగ్ పీఎస్, పోలీసు కంట్రోల్ రూంలో పనిచేశారు. దీనితో పాటు మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ప్రస్తుతం సైబర్ సెల్‌లో ఉన్న వి.జానకిరామయ్యకు ట్రాఫిక్-2 ఇన్‌స్పెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. నందిగామ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న కె.సతీష్‌ను సీసీఎస్‌లో నియమించారు.

ప్రజలపై విద్యుత్ భారం.. జగన్ కమీషన్ల పాపమే

» తప్పుడు పనులు చేసింది చాలక చార్జీలు పెంచారంటూ ఆందోళనలా

» వైసీపీపై టీడీపీ నేత లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆగ్రహం

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి కమీషన్ల కోసం చేసిన తప్పుడు పనుల కారణంగానే ప్రజలపై ట్రూ అప్ చార్జీల భారం పడుతోంది. కూటమి ప్రభుత్వం విద్యుత్‌చార్జీలు పెంచలేదు. విద్యుత్ చార్జీలు పెంచారంటూ వైసీపీ నాయకులు ఆందోళనలు చేయడం సిగ్గుచేటు.' అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. విజయవాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో తొమ్మిదిసార్లు విద్యుత్ చార్జీలు పెరిగాయన్నారు. సెబీ ద్వారా విద్యుత్ కొనుగోలు ధరల్లో వ్యత్యాసాలను వివరించారు. జగన్‌రెడ్డి కమీషన్లకు కక్కుర్తిపడి రూ.1,750 కోట్లు లంచం తీసుకున్నట్లు అమెరికా ఎఫ్‌బీఐ కేసు నమోదు చేసి అధికారికంగా ప్రకటించిందని లుక్కా సాయిరాం ప్రసాద్‌గౌడ్ ఆరోపించారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయండి

» బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పిలుపు



హైందవ శంఖారావం కార్యక్రమ కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, వీహెచ్‌పీ నేతలు

వన్‌టౌన్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న డిమాండ్‌తో జనవరి 5న విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడకు సమీపంలోని కేసరపల్లిలో నిర్వహిస్తున్న హైందవ శంఖారావం సభను జయప్రదం చేయాలని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ పిలుపునిచ్చారు. భవానీపురంలోని ఎన్డీయే కార్యాలయంలో శుక్రవారం ప్రచార వాహనాలకు ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కరపత్రాలను విడుదల చేశారు. ప్రతి హిందువు హైందవ శంఖారావం సభకు హాజరుకావాలని, ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు ఏకం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ పాలనలో హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ అమానుషంగా ప్రవర్తించారన్నారు. దేవాలయాలపై ప్రభుత్వ అజమాయిషీని పూర్తిగా తొలగించాలని వీహెచ్‌పీ సహాయ కార్యదర్శి కొంపల్లి శ్రీనివాసరావు డిమాండ్‌చేశారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్ 113, 121, 132
చికెన్ విత్ స్కిన్ 220
చికెన్ స్కిన్‌లెస్ 230
నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600



సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో యోగా శిక్షణ

సత్యనారాయణపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): దత్త పీఠాధిపతి నాద బ్రహ్మ ,యోగబ్రహ్మ పరమపూజ్య గణపతి సచ్చిదానంద మహాస్వామి దివ్య ఆశీస్సులతో శుక్రవారం నుంచి 31వ తేదీ వరకూ ఉచిత దత్తక్రియా యోగశిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్టు సమన్వయకర్త దంతులూరి తిరుపతిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తరగతులు గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో ఉదయం 6 నుంచి 7గంటల వరకూ నిర్వహించడం జరుగుతుందన్నారు. నాడీశుద్ధి వ్యాయామాలు ముద్రలు, ధ్యాన ప్రక్రియలు బోధించడం జరుగుతుందన్నారు. వివరాలకు 98660 41332లో సంప్రదించాలన్నారు.

మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

● ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఘన నివాళి

గవర్నర్‌పేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విపక్షాలు సైతం ఆదరించే నేతగా, అందరివాడుగా మన్మోహన్‌సింగ్ దేశ ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ శుక్రవారం కాంగ్రెస్ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ మన్మోహన్ జీవితాంతం దేశసేవలోనే గడిపారన్నారు. ఆర్థికవేత్తగా ఆయన దేశానికి అందించిన సేవలను పాఠ్యాంశాలుగా చేర్చాలన్నారు. సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు మాట్లాడుతూ ఆయన ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు దేశం వేగంగా అభివృద్ధి చెందడానికి దోహదం చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీసీసీ ఉపాధ్యక్షుడు వి.గుర్నాథం, ప్రధాన కార్యదర్శులు కొలనుకొండ శివాజీ, మీసాల రాజేశ్వరరావు, షేక్ అన్సారీ, బైపూడి నాగేశ్వరరావు, యువజన కాంగ్రెస్ నేతలు, మహిళా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల పలు పార్టీల నేతలు సంతాపం తెలిపారు. 10 సంవత్సరాలు భారత ప్రధానిగా డాక్టర్ మన్మోహన్ సింగ్ చేసిన సేవలు మరువలేనివని, ఆయన మరణం తీరని లోటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు అన్నారు.



ఆంధ్రరత్న భవన్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న జెల్లి విల్సన్, నరహరశెట్టి నరసింహారావు తదితరులు



చైర్మన్‌ను సత్కరిస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నేతలు

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి

చిట్టినగర్, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. భీమన్నవారిపేటలోని వాల్మీకి భవనం వద్ద శుక్రవారం నాయీబ్రాహ్మణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం చంద్రబాబు అనేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఇందులో భాగంగా బీసీల కోసం బడ్జెట్లో రూ.39వేల కోట్లు కేటాయించారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను పెట్టి వాటికి కేటాయించిన నిధులను నవరత్నాలకు మళ్లించిదని విమర్శించారు. 56 కార్పొరేషన్లను మొక్కుబడిగా పెట్టి బీసీలను దగా చేసిందన్నారు. దేవాలయాలలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ.15వేల వేతనాన్ని రూ.25వేలకు కూటమి ప్రభుత్వం పెంచిందన్నారు. బీసీ విద్యార్థుల కోసం జిల్లా కేంద్రాల్లో డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారని, విజయవాడలోని గొల్లపూడిలో ఐఏఎస్ స్టడీ సెంటర్ ను ప్రారంభించారన్నారు. సమావేశంలో నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నవిరి మహేష్, రాము, దుర్గారావు, రామారావు, రాయవరపు గణపతి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న అఖిల భారత మాల సంఘాల జేఏసీ నాయకులు, కార్యకర్తలు

స్వరాజ్య మైదానంలో డ్వాక్రా బజార్ తొలగించాలి

వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బందరు రోడ్డులోని స్వరాజ్య మైదానంలోని అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలోని డ్వాక్రా బజార్‌ను ఎత్తివేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి దేవిప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సామాజిక న్యాయశిల్పం (అంబేడ్కర్ విగ్రహం) ప్రాంగణంలో పెట్టిన డ్వాక్రా బజార్‌ను ఎత్తివేయాలన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో అంబేడ్కర్ గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ఎస్సీ వర్గీకరణ కూడా రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ వైస్ చైర్మన్ గుర్రం రామారావు, పరసా సురేష్, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్, బొనిగల ప్రదీప్, కాంతారావు, దాసరి ఏసు, కొండలరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : రామరాజ్యనగర్ కబేళా సబ్‌స్టేషన్, కేకేనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జోజినగర్, లక్ష్మీనగర్‌కాలనీ, చర్చిరోడ్డు, ఆర్టీసీ వర్కుషాపురోడ్డు, టీవీ కృష్ణారావువీధి. ఆర్కే పబ్లిక్ స్కూల్, కామకోటినగర్ పోస్టాఫీస్‌రోడ్డు, కోళ్లఫాంరం రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ టౌన్ విద్యుత్‌శాఖ ఈఈ రవీంద్రబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీ పార్కులో వెలుగులు

వన్‌టౌన్: హౌసింగ్ బోర్డు కాలనీ పరిధిలోని 300 ఎస్ఎఫ్‌టీ, 450 ఎస్ఎఫ్‌టీ నివాస సముదాయాల వద్ద గల పార్కులో కొత్త ఐమాక్స్ లైట్స్ పవర్‌పోల్స్‌ను ఏర్పాటుచేశారు. గతంలో ఆ ప్రాంతం చీకటిగా ఉండటంతో ప్రజలు విద్యుత్ దీపాలను ఏర్పాటు చయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరిని కోరారు. విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించడంతో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



ధర్నాచౌక్ వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి కూటమి

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా

ధర్నాచౌక్, డిసెంబర్ 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ భారాన్ని తగ్గించేంతవరకు తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని వైసీపీ సెంట్రల్ నియోజవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. కరెంట్ చార్జీల బాదుడుపై ధర్నాచౌక్‌లో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అబద్ధాలు, మోసాలతో అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను విస్మరించడం సీఎం చంద్రబాబుకు అలవాటేనన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ఇప్పుడు రూ.15,485.36 కోట్ల భారాన్ని ప్రజలపై మోపారన్నారు. ప్రభుత్వ చేతగానితనం వల్ల అతి తక్కువ కాలంలోనే అన్ని వర్గాల ప్రజలు రోడ్డెక్కారన్నారు. వైసీపీ కార్పొరేటర్లు యరగొర్ల తిరుపతమ్మ, శ్రీరాములు, అలంపూర్ విజయలక్ష్మీ, ఇసరపు దేవీ రాజా రమేష్, కొండాయిగుంట మల్లీశ్వరి, జానారెడ్డి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి: సీపీఎం

వన్‌టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం కార్పొరేటర్ బోయి సత్తిబాబు డిమాండ్ చేశారు. 37వ డివిజన్ పరిధి వన్‌టౌన్‌లో శుక్రవారం జరిగిన మునిసిపల్ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఎన్నికలకు ముందుకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పారన్నారు. ఆ మాట నిలబెట్టుకోవాలన్నారు. పెంచిన చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వద్దని, అవినీతి ఆదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 27న జరిగే విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఎదుట పాల్గొనాలని పిలుపు నిచ్చారు.



37వ డివిజన్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నేటి నుంచి బాలోత్సవం

సత్యనారాయణపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించేందుకు విజయవాడ చిల్డ్రన్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం బాలోత్సవం నిర్వహిస్తున్నామని అసోసియేషన్ చైర్మన్ వి.మురళీమోహన్ అన్నారు. ముత్యాలంపాడులో శుక్రవారం విజయవాడ చిల్డ్రన్స్ అండ్ ట్యుటోరియల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 28, 29 తేదీల్లో నిర్వహించబోయే బాలోత్సవం కరపత్రాలను ఆవిష్కరించారు. ఎనికేపాడు విజయ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్ కళాశాలలోఈఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాసరావు, కార్యదర్శి సి.హెచ్.హరినాథ్, కోశాధికారి ఈశ్వర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రేపు శారద కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం

ధర్నాచౌక్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శారద కళాశాల గోల్డెన్ జూబ్లీ సందర్భంగా ఈ నెల 29న పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించనున్నట్టు శారద ఎడ్యుకేషనల్ సొసైటీ విద్యా సంస్థల కార్యదర్శి సీఏ కుందా రామనారాయణ తెలిపారు. గాంధీనగర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రామనారాయణ మాట్లాడుతూ 50ఏళ్లుగా కళాశాలలో అతి తక్కువ ఖర్చుతో ఎంతో మందికి విద్యను అందించడం జరిగిందన్నారు.

ఉద్యోగమేళాపై విస్తృత ప్రచారం

భవానీపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : నగరంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 28న మొగల్రాజపురంలోని వీపీ సిదార్థ పబ్లిక్ స్కూల్‌లో జరిగే మెగా జాబ్ మేళాపై కూటమి నేతలు విస్తృత ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే సచివాలయాల వద్ద బ్యానర్లతో ప్రచారం చేస్తున్నారు. 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు మోరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ఊర్మిళానగర్, చర్చి సెంటర్లలో దుకాణాలు, ప్రతీ ఇంటింటికి వెళ్లి ప్రచారం కల్పించారు. కాకర్ల కోటీ, మోడీ వెంకటరాజు, సందక వెంకట్రావు, యువరాజు, గుమ్మబాలు, రామారావులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శుక్రవారం అందజేశారు. 58వ డివిజన్ వడ్డెర కాలనీకి చెందిన సిరివెల్ల రామచంద్రన్‌కు రూ.2,63,651, 30వ డివిజన్ మద్యకట్ట ప్రాంతానికి చెందిన ముదుల దుర్గాభవానికి రూ.32,500 చెక్కులను అందజేశారు.



చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అగ్నిప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. బైసాని సావిత్రి(58) కేదారేశ్వరపేట ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. ఈనెల 17న పూజా కార్యక్రమాలు చేస్తున్న సమయంలో దీపారాధాన చేసిన ప్రమిద ద్వారా చీరకు నిప్పంటుకుని తీవ్రంగా గాయపడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నాటి నుంచి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి

అజిత్‌సింగ్‌నగర్, డిసెంబరు 27 : ఓ వృద్ధుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరచిన ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. న్యూ రాజరాజేశ్వరిపేట ప్రాంతానికి చెందిన కుక్కల దుర్గారావు(72) రిక్షా నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వెళ్తుండగా మార్గ మధ్యంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్రవాహనంపై వచ్చి వేశ్యలు ఎక్కడ ఉంటారని ప్రశ్నించారు. నాకు తెలియదని దుర్గారావు సమాధానం చెప్పడంతో విచక్షణా రహితంగా ఇనుపరాడ్డుతో అతనిపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా?
అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది.
మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు.
పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.
మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి

GRAND GALA 2ND WEEK at NAVRANG A/c




తెలుగు - 3D, రోజూ 4 ఆటలు
11:45 AM, 3:00 PM, 6:45 PM, 9:45 PM
ADVANCE BOOKING OPEN ONLINE " BOOK MY SHOW"

RUNNING TO PACKED HOUSES
తెలుగు రాష్ట్రాలలో హిందీ వెర్షన్‌కు అద్భుత స్పందన. అసాధారణ వసూళ్ళు..



హిందీ వెర్షన్
బెంజసర్కిల్ : క్యాపిటల్ సినిమాస్ 2-00 PM, 7-50 PM
విజయవాడ :
ఊర్వశి INOX 10-40 pm
PVR INOX 4-30 pm
LEPL INOX 10-30 pm
Zineeverse Motion picture (P) Ltd. release
Cell : 78937 22277

2వ వారం
అప్సర సినిమా




తెలుగు - 2D
రోజూ 4 ఆటలు :
11-45AM, 2-45PM, 6-45PM, 9-45PM
www.justickets.in
www.bookmyshow.com



అన్నపూర్ణ కాంప్లెక్స్	- విజయవాడ
LEPL ఐనాక్స్	- విజయవాడ
పివిఆర్ సినిమాస్	- విజయవాడ
క్యాపిటల్ సినిమాస్	- విజయవాడ
సాయిరాం స్క్రీన్స్	- విజయవాడ
బాలాజీ	- గుడివాడ
పివిఆర్ సినిమాస్	- మచిలీపట్నం
గగన్ మహల్	- పామర్రు
నటరాజ్	- బంటుమిల్లి

Contact:9866010970

విజయవాడ : స్వర్ణమల్టీప్లెక్స్	మచిలీపట్నం : రేవతి
విజయవాడ : జి3 రాజ్‌యువరాజ్	మచిలీపట్నం : PVR వరం సెంట్రల్ మాల్
విజయవాడ : ఊర్వశి INOX	గుడివాడ: మినీ భాస్కర్
లబ్బీపేట: పివిపిసినీపోలీస్	ఉయ్యూరు: దీపక్‌మహల్
బెంజసర్కిల్ : క్యాపిటల్ సినిమాస్	నూజివీడు : మినీసత్యనారాయణ
వన్‌టౌన్ : సాయిరామ్‌స్క్రీన్స్	ఇబ్రహీంపట్నం: బాలాజీ ఐకానియా
పెనమలూరు : రవీంద్రసినిమాస్	నందిగామ : లక్ష్మీప్రసన్న
పోరంకి : బాలాజీ సినీవిల్లా	జగ్గయ్యపేట : శ్రీఅలంకార్ సినిమాస్
కంకిపాడు: శ్రీచంద్ర	



Capital CINEMAS 4K
TRENDSET MALL, BENZ CIRCLE
Book Online Tickets : Paytm TICKETNEW
NOW SHOWING



BABY JOHN (U/A) (HIN) 10:00 AM,1:25 PM 4:15 PM,7:55 PM,11:00 PM
MAX (U/A) (TEL) 10:15 AM,1:00 PM,7:30 PM
PUSHPA THE RULE PART 2 (U/A) (TEL) 10:15 AM,2:10 PM,3:40 PM,6:00 PM,9:50 PM
MUFASA THE LION KING - 3D (U) (TEL) 10:20 AM,12:50 PM,3:20 PM,5:50 PM,8:20 PM
MUFASA THE LION KING - 2D (U) (TEL) 11:10 AM,1:40 PM,4:10 PM,10:50 PM
UI (U/A) (TEL) 10:40 AM, 7:30 PM
MUFASA THE LION KING - 3D (U) (E) 10:10 PM
MARCO (A) (HIN) 4:40 PM, 10:30 PM
BARROZ (U) 3D (TEL) 10:20 AM, 7:35 PM
SRIKAKULAM SHERLOCKHOLMES (A) (TEL) 5:00 PM, 10:15 PM
DRINKER SAI (A) (TEL) 1:20 PM
*NOTE: Timings are subject to change without any prior notice.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

TO-LET COMMERCIAL
» నూరంపల్లి - నూజివీడు రోడ్డులో ALEAP ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో 8,400 S.Ft. 3 స్టేర్స్ బిల్డింగ్ కమర్షియల్ లిఫ్ట్‌తో గోడౌన్స్‌కు అద్దెకు సంప్ర. 94401 74206, 98854 61108
AJB - 225441

PLOT FOR SALE
» కేసరిపల్లి To సావారిగూడెం నందు ఇల్లు కట్టుకోవటానికి అనుకూలంగా ఉన్న Plots కలవు. చ.గ రూ. 7,500/-. సంప్ర. 93469 18356
AJB - 748

» అమరావతి రాజధానికి దగ్గరలో పొన్నెకల్లు వద్ద 40 ఎకరాల CRDA లే-ఔట్ & AIIMS ఎదురు రోడ్డులో గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌లు, ఫ్లాట్స్ కలవు. సెల్ : 90522 72828, 83672 82709
AJB - 407

WANTED
» గూడవల్లి ఆటోనగర్ మరియు VJA సిటీలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం. ఒంటరి వారికి వసతి సౌకర్యం. సంప్ర: 92472 71222, 96423 13999.
AJB - 727

» విజయవాడలో పనిచేయుటకు పురుష సెక్యూరిటీ గార్డులు కావలెను. 12 గంటలు డ్యూటీ. జీతం 15000 + PF + ESI సెల్: 73861 78618, 83412 46778
AJB- 225287

FLAT FOR SALE
» గొల్లపూడి ఒన్ సెంటర్ పోస్టాఫీసు రోడ్డులో గ్రూప్ హౌస్ ఫస్ట్ ఫ్లోర్, నార్త్ ఫేసింగ్ 2BHK అమ్మబడును. 2వీలర్ పార్కింగ్ 25 లక్షలు మాత్రమే ✆ 96666 94418
AJB- 36

TO-LET
» కృష్ణలంక, గుండుకోటయ్య వీధి, SBI రోడ్‌లో పూర్తి ఫర్నిచర్‌తో A/C రూమ్స్, GF లో 4 రూమ్స్ ఆఫీసులకు, గోడౌన్‌కు, ఫ్యామిలీస్‌కు నెలవారి అద్దెకు. సంప్ర:83099 04493
AJB- 743

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ.290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా...?



మీ కుటుంబ సభ్యులలో
మీ బంధుమిత్రులలో
మీ సహోద్యోగులలో
ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా?
అయితే వారికి తీపి గుర్తుగా
'ఆంధ్రజ్యోతి' ద్వారా అందించండి
ఆత్మీయ శుభాకాంక్షలు
GST 5% Extra
ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్, సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.
అందిస్తోంది
25% సిటీ / జిల్లా ప్రకటనలకు డిస్కౌంట్
15% జోన్ ప్రకటనలకు డిస్కౌంట్
పటమట : 99854 11868, 1 టౌన్ : 99854 09286
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777, పెనమలూరు : 99854 09240
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09286, 99854 85777, 99854 11733

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	113,121, 132
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.600

ఖోఖో పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

మైలవరం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థి సంతోష్ కుమార్ ఈనెల 28న సెంట్రల్ యూనివర్సిటీ తమిళనాడులో నిర్వహించనున్న ఇంటర్ యూనివర్సిటీ పురుషుల ఖోఖో పోటీలకు, 29న కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కాలికట్‌లో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ ఖోఖో పోటీలకు బీఎస్సీ సెంకడ్ ఇయర్ విద్యార్థిని సంధ్యారాణిలు ఎంపికైనట్టు మైలవరం ఎల్‌హెచ్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇళ్ల రవి శుక్రవారం తెలిపారు. ఈమేరకు వారిని ఆయనతో పాటు పీడీ మేజర్ మన్నే స్వామిలు అభినందించారు.



అభినందిస్తున్న రవి

వణికిస్తున్న వానరాలు

● గుంపులు, గుంపులుగా సంచారం ● ప్రభుత్వ కార్యాలయాల వద్ద తిష్ట ● నివాసాల్లోకి చొరబాటు .. హడలి పోతున్న గృహిణులు

వానర మూకల సంచారంతో మహిళలు, పిల్లలు భయాందోళన చెందున్నారు. చేతుల్లో వస్తువులు చేతుల్లో ఉండగానే లాక్కెళుతున్నాయి. ఇప్పటికే పలువురు కోతుల దాడిలో గాయపడ్డారు.

(ఆంధ్రజ్యోతి - జి.కొండూరు): మండల కేంద్రమైన జి.కొండూరులో గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వానరాలు ప్రజలను వణికిస్తున్నాయి. వానర మూకల సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జి.కొండూరులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద తిష్ట వేసుకొని ఉంటున్నాయి. తహసీల్దార్ కార్యాలయం వద్ద మందలు మందలుగా సంచరిస్తుండటంతో పనులు నిమిత్తం వచ్చే ప్రజలు వాటిని చూసి బెదిరిపోతున్నారు. పలు పనుల నిమిత్తం వచ్చే వారి టూ వీలర్స్ సీట్లను ఎంచక్కా చించేస్తూ వాటి ఆనందాన్ని తీర్చుకుంటున్నాయి. అవి ఆపని చేసే సమయంలో ఏమైనా అంటే మందకు మంద దాడికి దిగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బైక్ సీట్లు చినిగిపోతున్నా ఏం చేయకుండా చేష్టలుడిగి చూడటం తప్ప ఏం చేయలేకపోతున్నామని వాహనదారులు వాపోతున్నారు. తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న ఎస్సీ, బీసీ వసతి గృహాల్లోని విద్యార్థులకు, ఎంపీపీ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు సైతం కోతుల బెడద తప్పడం లేదు. మరో పక్క నివాసాలపై కోతులు దాడులు ఆగటం లేదు. వంట గది తలుపులు తెరచి ఉంటే ఇంట్లోకి ప్రవేశించి తినే వస్తువులను సర్వనాశనం చేస్తున్నాయి. రేకుల షెడ్లపై ఎక్కి రేకులను ధ్వంసం చేస్తున్నాయి. ముఖ్యంగా గుడి సెంటర్, మెయిన్ సెంటర్, ప్రభుత్వ కార్యాలయాలు, కొల్లమ్మ గట్టు, ఆత్కూరు రోడ్డు, మూతపడిన థియేటర్, తదితర ప్రాంతాల్లో సుమారు 100కు పైగా వానరాలు ప్రతీ రోజూ తిరుగుతూ ఉన్నాయి. బజారుకు వెళ్లి చేతులతో ఏదైనా తీసుకొని వచ్చేందుకు మహిళలు, పిల్లలు భయాందోళన చెందున్నారు. చేతుల్లో వస్తువులు చేతుల్లో ఉండగానే లాక్కెళుతున్నాయి. ఆత్కూరు రోడ్డులో ఇష్టానుసారంగా సంచరిస్తూ ద్విచక్రవాహనదారులను హడలెత్తిస్తున్నాయి. ఇప్పటికే పలువురు కోతుల దాడిలో గాయపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి తమను కాపాడాలని పలువురు వేడుకుంటున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద గుంపులు గుంపులుగా సంచరిస్తున్న వానరాలు

భయంతో బతుకుతున్నాం



మందలకు కోతులు మందలు వచ్చి ఇళ్ల మీద పడుతున్నాయి. ఎప్పుడు ఎవర్ని కరుస్తాయో తెలియడం లేదు. పిల్లలను వదిలివెళ్లాలంటే భయమేస్తుంది. ఇళ్ల పీకి పందిరేస్తున్నాయి. ఒక కోతుల్ని పట్టించి కాపాడాలి.

చింతల శివమ్మ, గృహిణి

ప్రశాంతత లేదు



ప్రశాంతంగా ఇళ్లలో ఉండలేకపోతున్నాం. ఒక్కసారిగా వచ్చి పడుతున్నాయి. పిల్లలను దగ్గరుండి స్కూళ్లకు పంపాల్సి వస్తుంది. మగాళ్లు ఉండి కర్రలు తీసుకుంటే తప్ప అవి అక్కడి నుంచి వెళ్లడం లేదు. ఎదురు తిరుగుతున్నాయి.

బండారు అనూష, గృహిణి

త్వరలోనే పట్టిస్తాం

గతంలో రెండు సార్లు పట్టించాం. మరళా పెరిగిపోయాయి. కోతికి ఒక్కొక్క దానికి రూ.1,000లు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టి త్వరలో పట్టించేందుకు చర్యలు తీసుకుంటాం.

వై.బసవలింగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి



సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలిస్తున్న లక్ష్మీశ


సూర్యఘర్ పరిశీలన

ఇబ్రహీంపట్నం రూరల్: పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గుంటుపల్లిలో రిటైర్డ్ ఆర్‌అండ్‌బీ ఇంజనీరు ఏఆర్‌ఎస్‌పీ ప్రసాద్ ఇంటిపై నిర్మించిన సోలార్ ఫలకలను శుక్రవారం పరిశీలించారు.

క్రీడాదుస్తులు వితరణ

గంపలగూడెం : పెనుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థి పాఠశాలలోని 24 మంది క్రీడాకారులకు రూ.10వేలు విలువ చేసే క్రీడా దుస్తులను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కిష్టాఫర్, ఎస్‌ఎంసీ ఛైర్మన్ ఆంజనేయులు, పీడీ అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.













బట్టీలు తొలగించాలని ఆందోళన

రెడ్డిగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామంలో జనావాసాల మధ్య ఉన్న ఇటుక బట్టీలను తొలగించాలని పాతనాగులూరు గ్రామానికి చెందిన ప్రజలు శుక్రవారం విజయవాడ - విస్సన్నపేట రోడ్డుపై టెంట్ వేసుకొని ధర్నా చేశారు. ఈ ధర్నాలో సర్పంచ్ కొలుసు చిన్ని, సుధాకర్‌రావు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తగా చిరుమామిళ్ల

నందిగామ రూరల్ : లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న లక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు చిరుమామిళ్ల వెంకట లక్ష్మీ సాయిబాబును నియమించినట్టు ఏసీ సీతారామయ్య శుక్రవారం తెలిపారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు. పవన్‌కళ్యాణ్, పాల్గొన్నారు.

నాగార్జున విద్యార్థినుల ప్రతిభ

తిరువూరు: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో స్థానిక నాగార్జున స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చారు. శుక్రవారం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్స్ విభాగంలో నాళ్లా లక్ష్మీ, నాగసాయి ప్రణతి, ప్రథమస్థానం, జూనియర్స్ విభాగంలో నాళ్లా నాగవెంకట తోయజాక్షిలు ప్రథమస్థానం సాధించారు.

కరాటేలో చిన్నారుల ప్రతిభ

తిరువూరు: ఇటీవల గోవాలో నిర్వహించిన ప్రపంచ కప్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలో పట్టణానికి చెందిన మాస్టర్ ఉమర్‌ముక్తార్, బేబీ మున్నాఉమైజాలు ఉత్తమ ప్రతిభ కనపర్చారు. శుక్రవారం ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిలి రవినాయుడు చిన్నారుల్ని అభినందించారు. ఫిబ్రవరి 23న, బ్యాంకాక్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ పోటీలకు వెళ్లేందుకు తన వంతు ప్రోత్సాహన్ని అందిస్తానన్నారు.నియోజకవర్గం తెలుగుయువత నాయకులు హుస్సేన్, కరాటే కోచ్ శివ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

గంపలగూడెం,డిసెంబరు27,(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేలకు సంబంధించి ఏర్పడిన సమస్యలు పరిష్కరించేందుకు ఉమ్మడిదేవరపల్లి, గంపలగూడెం గ్రామాల్లో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.గంపలగూడెంలో రైతులు తమ భూ సమస్యలపై 34 అర్జీలు అందజేశారు. ఉమ్మడిదేవరపల్లి గ్రామంలో రీసర్వే ప్రారంభోత్సవ గ్రామసభ ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ రాజకుమారి, మండల సర్వేయర్ సాంబశివరావు,ఆర్ఐ బద్రీ, వీఆర్వోలు సీతామహాలక్ష్మీ, వీరారెడ్డి, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చందర్లపాడు: ముప్పాళ్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులు పలు భూసమస్యలను ఆర్డీవో కె బాలకృష్ణకు తెలియజేసి పరిష్కారాలు పొందారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని ఆర్డీవో కె.చైతన్య అన్నారు. కేతనకొండ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. తొలుత జరిగిన రీ సర్వే ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. 1996లో ప్రభుత్వం మంజూరు చేసిన పట్టాల్లో పూర్వీకుల నుంచి తమకు సంక్రమించేలా పేర్లు మార్పులు చేయాలని లబ్ధిదారులు సదస్సులో అర్జీలు సమర్పించారు. వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు అర్జీలు అందజేస్తున్న రైతులు

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని ఆందోళనలు

జగ్గయ్యపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులపై మోపిన రూ.15వేల కోట్ల రూపాయాల భారాన్ని వెనక్కీ తీసుకోవాలని మాజీ కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలో ఇండోర్ సబ్‌స్టేషన్, ట్రాన్స్‌కో ఏడీఈ కార్యాలయాల ఎదుట పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ నిర్వహించిన ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవి కుమార్, వట్టెం మనోహర్, వైస్‌ఛైర్మన్ హఫీజున్నీసా, చౌడవరపు జగదీష్, విజిత తదితర నేతలతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఏడీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు.

లక్ష్మీపురం(తిరువూరు: విద్యుత్‌చార్జీల పెంపును నిరసిస్తూ నియోజకవర్గం వైసీపీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని లక్ష్మీపురం విద్యుత్‌సబ్ స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచమని హామీ ఇచ్చిన కూటమి నాయకులు, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలపై విద్యుత్‌భారంతో పాటుగా, అనేక ఆర్థిక భారాలు మోపుతున్నారని విమర్శించారు. హామీలు అమలుపర్చేంత వరకు ప్రజలపక్షాణ పోరాటం సాగిస్తామని వైసీపీ నాయకులు అన్నారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీ రామకృష్ణకు వినతిపత్రం అందించారు.



ట్రాన్స్‌కో ఏడీఇకి వినతిపత్రం అందచేస్తున్న తన్నీరు

విద్యుత్ భారానికి కారకుడు జగన్మోహన్‌రెడ్డినే : జంపాల

ఇబ్రహీంపట్నం , డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజలపై విద్యుత్ భారం పడేందుకు ప్రధాన కారకుడు ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డే అని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్యఅన్నారు. ఇబ్రహీంపట్నంలో ఆయన శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ 2019-24 మధ్య కాలంలో వైసీపీ హ యాంలో పది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదార్ల నడ్డి విరిసిన జగన్ నేడు కూటమి ప్రభుత్వం విద్యుత్ భారం మోపిందని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. నేటి విద్యుత్ భారానికి జగన్ అధికారంలో ఉండగా రెగ్యులేటరీ అథారిటీ ద్వారా పెంచిన చార్జీలే కారణమన్నారు. కుటిల రాజకీయాలు చేయడం మానుకొని రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని జగన్‌కు జంపాల హితవు పలికారు.



మాట్లాడుతున్న జంపాల సీతారామయ్య

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

జగ్గయ్యపేట, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): అనారోగ్యానికి గురైన పేదలకు సీఎం సహాయనిధి ఒక వర మని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. శుక్ర వారం తన నివాసంలో నియోజకవర్గంలో 30 మం దికి సహాయనిధి నుంచి మంజూరైన రూ.17,63, 625ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నేతలు కే.ఎస్.ఎన్ ప్రసాద్, కట్టా నరసింహారావు, డీవీ నరసింహారావు, మల్లెలకొండ, పీ.శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: సీఎం సహాయ నిధి పేదల వైద్య ఖర్చులకు ఎంతగానో దోహదం చేస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు, శ్రీరాంపురం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు నాదెళ్ల చెన్నకేశవరావు (కేసు బాబు) అన్నారు. గ్రామానికి చెందిన బడిపాటి మురళీకి రూ.52,950, గద్దల నిశిక రూ.30 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరయ్యాయి. ఆచెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు ఆయన అందించారు.



చెక్కులు అందిస్తున్న నాదెళ్ల చెన్నకేశవరావు

యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

నందిగామ రూరల్, డిశంబరు 27(ఆంధ్రజ్యోతి): అంబారుపేట గ్రామంలోని కిట్స్ స్వచ్ఛంద సంస్థ స్థాపించిన స్కిల్ డెవలప్‌మెంట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెంటర్ ఆవరణలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీడ్‌ఆప్ ఛైర్మన్, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి మాట్లాడుతూ కిట్స్ సంస్థ విద్య, వైద్యం, ఉపాధి అందిస్తూ ఎంతో మంది నిరుద్యోగ యువతకు తోడ్పాటునందిస్తున్నారన్నారు. సీడ్‌ఆప్ యువతకు ఉద్యోగాలు పొందే లక్ష్యంతో కార్యక్రమాలు రూపుదిద్దుకుంటున్నాయని అంటున్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త విజయలక్ష్మీ, సంస్థ ఛైర్మన్ గంగాధర్, వైస్ ఛైర్మన్ జగన్నాధరావు, మేనేజింగ్ ట్రస్టీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10 వసంతాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

విస్సన్నపేట: మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ నేత కందుకూరి మోహన్ శుక్రవారం అధికారులను కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తిరువూరు: పట్టణ విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ నాయకులు రమేష్, సూరిబాబు, రాంబాబు, బ్రహ్మాచారి, చంద్రశేఖరాచారి, సూర్యనారాయణ, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

గంపలగూడెం: తోటమూల ప్రయివేట్ అతిథిగృహంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్యను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. మోదుగు డానియేలు, ఆదాం, కుటుంబరావు, లక్ష్మణరావు, పాల్గొన్నారు.

నిప్పులపై నడిచిన దీక్షా స్వాములు

జగ్గయ్యపేట: పట్టణంలో ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవస్థానంలో మండల పూజల ముగింపు సందర్భంగా శుక్రవారం స్వామికి 108కలశాలతో అభిషేకం, నగర సంకీర్తన, జ్యోతులతో శోభాయాత్ర నిర్వహించారు. దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన నిప్పుల కొలిమిపై నడిచారు. భజనల అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు.

ఆయకట్టుకు నీరు విడుదల

నందిగామ: ఎత్తిపోతల పథకాల ఆయకట్టుకు నీరందించేందుకు పులిచింతల నుండి నీరు విడుదల చేయిస్తున్నట్లు ఎస్ఎస్‌పి ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులిచింతల సూపరింటిండెంట్ ఇంజనీర్‌తో ఫోన్‌లో మాట్లాడి నీరు విడుదల చేయించినట్లు ఆయన తెలిపారు. రైతులు ఆ నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

జగ్గయ్యపేట: డ్వాక్రా, వెలుగు మిత్రాల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర తెలుగునాడు అంగన్‌వాడీ, డ్వాక్రా విభాగం అధ్యక్షురాలు ఆచంట సునీత హామి ఇచ్చారు. శుక్రవారం మంగళగిరిలో పార్టీ సెంట్రల్ ఆఫీసులో సునీతను 16 జిల్లాల నుంచి వచ్చిన వెలుగు మిత్రలు కలిసి తమ సమస్యలను వివరించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

విస్సన్నపేట: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయమూర్తి కె.మోతిలాల్ సూచించారు. విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహిళా న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. తహసీల్దార్ కె.లక్ష్మి కల్యాణి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జగ్గయ్యపేట: పట్టణంలో కోదాడరోడ్డులో ఉన్న కోస్టల్‌బ్యాంకులో బ్యాంకు రజితోత్సవ వేడుకలు బ్రాంచ్ మేనేజర్ కే.బ్రహ్మారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రమేష్ -ఆస్టర్ హస్పిటల్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని పట్టణ ప్రముఖ ఎముకల వైద్యులు కే. విశ్వేశ్వరరావు, సీనియర్ కస్టమర్ రామనాథంతో కలిసి ప్రారంభించారు. డాక్టర్ సరిత వైద్య సేవలు అందించారు. మేనేజర్ బ్రహ్మారావు ,బ్యాంకు అధికారులు నవీన్‌కుమార్, వాసుదేవరావులు పాల్గొన్నారు.



పర్యవేక్షిస్తున్న బ్రహ్మారావు

ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చిన మహానేత మన్మోహన్

జగ్గయ్యపేట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టిన గొప్ప ఆర్థిక వేత్త, మాజీ ప్రధాని మ న్మోహన్ సింగ్ అని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాత య్య పేర్కొన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ మృతికి ఆ యన తన నివాసంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ ప్రసాద్, నరసింహరా వు, బి.వెంకటేశ్వరరావు, ఎం.నారాయణరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహన్ కార్యాలయ సిబ్బందితో కలిసి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం నివాళులు అర్పించారు.

జిల్లా జనసేన అధ్యక్షుడు సామినేని ఉదయభాను నివాసంలో వైస్‌ఛైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ మైనార్టీ నేత షేక్ సత్తార్, మాజీ కౌన్సిలర్లు మన్మోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో మాజీ కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్‌నాగేశ్వరరావు,హఫీజున్నీసా ఫిరోజ్, మనోహర్‌లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మైలవరం: మైలవరం బోసు బొమ్మ సెంటర్లో శుక్రవారం మన్మోహన్ చిత్ర పటానికి డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు పోతురాజు ఏసుదాసు, శీలం రామకృష్ణ, గిరికుమార్, పిట్టల నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

తిరువూరు: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప సభను కాంగ్రెస్ కార్యాలయం రాజీవ్‌భవన్‌లో శుక్రవారం పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. శ్రీనివాసరావు, ప్రకాశరావు, జీవన్ బాబు, కృష్ణమోహన్, జగన్నాథం పాల్గొన్నారు.

గంపలగూడెం: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సాయిబాబా కమిటీ సభ్యులు పెనుగొలనులో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరసింహారెడ్డి, నారాయణరావు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ గాంధీ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి గాంధీ పూలమాలలు వేసి నివాళు లర్పించారు.జి.శ్రీను, పాల్గొన్నారు.



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తాతయ్య





ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 85777, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

